శ్రీకాళహస్తిలో ఏం జరుగుతోంది?

- ఆడపిల్లల నిష్పత్తి ఎందుకు తగ్గుతోంది?
- విచారణకు ఆదేశించిన కలెక్టర్



నివేదిక చూపుతున్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వెయ్యి మంది మగశిశువులకు.. 629 ఆడ శిశువులు మాత్రమే జన్మిస్తున్నారు. ఇదీ గత మూడు నెలల్లో శ్రీకాళహస్తిలోని జనన గణాంకాల నిష్పత్తి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 1000:900 ఉంటే, శ్రీకాళహస్తిలో మాత్రం ఆ నిష్పత్తి ప్రమాదకరంగా ఉంది. ఈ నివేదికను చూసి కలెక్టర్ వెంకటేశ్వర్ ఆందోళన వ్యక్తంచేశారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి మల్టీ మెంబర్స్ అడ్వైజర్స్ కమిటీ సమావేశంలో ఈ అంశాన్ని ఆయన ప్రస్తావించారు. శ్రీకాళహస్తిలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులలో విచారణ కమిటీ వేసి విచారించి.. కారణాలు విశ్లేషించి నెలలోపు నివేదిక ఇవ్వాలని డీఎంహెచ్‌వో డాక్టర్ బాలకృష్ణ నాయక్‌ను ఆదేశించారు. ప్రైవేటు స్కానింగ్ సెంటర్లు, నర్సింగ్ హోం వైద్యులపై నిఘా పెట్టాలన్నారు. జిల్లాలో లింగనిర్ధారణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని స్పష్టంచేశారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే లైసెన్సులు రద్దుచేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. మారుమూల గ్రామాల్లోనూ లింగనిర్ధారణ చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ ఆనందమూర్తి, డీఐవో శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.



నాకు పని చేయడమే తెలుసు

- టీటీడీలో బాధ్యతల నిర్వహణ ఎన్నోజన్మల పుణ్యఫలం
- సన్మాన సభలో ఈవో శ్యామలరావు

తిరుమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'నాకు నిత్యం పనిచేయడమే తెలుసు. ప్రచారం చేసుకోవడం తక్కువ. చాలా దూరదృష్టితో పటిష్ఠ నిర్ణయాలు తీసుకుని అయిమలు చేశాం. టీటీడీ అంటే మినీ గవర్నమెంట్. తిరుమలలో భక్తుల సౌకర్యాలు ఓ వైపు, స్థానిక ఆలయాల అభివృద్ధి కార్యక్రమాలు మరోవైపు ఉంటాయి. ఈ రెండిటిపై ప్రత్యేక దృష్టి పెట్టాం. టీటీడీలో పనిచేయడం ఎన్నోజన్మల పుణ్యఫలం' అని బదిలీపై వెళుతున్న ఈవో శ్యామలరావు అన్నారు. తిరుపతిలోని టీటీడీ ఏడీ బిల్డింగులో మంగళవారం సాయంత్రం జరిగిన సన్మాన సభలో ఆయన మాట్లాడారు. టీటీడీ అందిస్తున్న సౌకర్యాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తుండటం చాలా ఆనందంగా ఉందన్నారు. లోపాలను సవరించుకుంటూ మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు ఉద్యోగుల సహకారాన్ని మరువలేనిదన్నారు. వచ్చే 25 ఏళ్లను దృష్టిలోపెట్టుకుని భక్తులకు అన్నప్రసాదాలు, లడ్డూ ప్రసాదాల నాణ్యతగా ఉండేలా వ్యవస్థలను తీసుకొచ్చామన్నారు. తనకు అవకాశమిచ్చిన సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. టీటీడీలోని ఉన్నతాధికారులు, అధికారులు శ్యామలరావు సేవలను కొనియాడారు. తిరుమల, తిరుచానూరు, శ్రీనివాసమంగాపురం ఆలయాల అర్చకులు ఈవోకు వేదాశీర్వచనం చేశారు. అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

టీటీడీ ఈవోగా నేడు సింఘాల్ బాధ్యతల స్వీకరణ

టీటీడీ ఈవోగా అనిల్‌కుమార్ సింఘాల్ బుధవారం బాధ్యతలు తీసుకోనున్నారు. ప్రస్తుతం ఈవోగా ఉన్న శ్యామలరావును జీఏడీకి బదిలీ చేయడంతో పాటు ఆస్థానంలో గతంలో ఈవోగా పనిచేసిన అనిల్‌కుమార్ సింఘాల్‌ను మళ్లీ ఈవోగా నియమించిన విషయం తెలిసిందే. ఈక్రమంలో బుధవారం ఉదయం 11-11.30గంటల మధ్య శ్రీవారి ఆలయంలో సింఘాల్ బాధ్యతలు స్వీకరించనున్నారు. అలాగే టీటీడీ బోర్డు ఎక్స్‌అఫిషియో సభ్యుడిగానూ బాధ్యతలు తీసుకుంటారు.

14, 15 తేదీల్లో జాతీయ మహిళా సాధికారత సదస్సు

- హాజరు కానున్న 250మంది మహిళా ప్రజా ప్రతినిధులు



మాట్లాడుతున్న ప్రసన్నకుమార్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఈ నెల 14, 15 తేదీల్లో చట్టసభల జాతీయ మహిళా సాధికారత సదస్సు జరగనుంది. తిరుచానూరులోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో పార్లమెంటు స్పీకర్ ఓంబిర్లా అధ్యక్షతన జరిగే ఈ సదస్సుకు పార్లమెంటు మహిళా సాధికార కమిటీ ఛైర్‌పర్సన్ దగ్గుబాటి పురందేశ్వరితో పాటు సభ్యులు, దేశంలోని వివిధ రాష్ట్రాల అసెంబ్లీ, శాసనమండలిలో ఉన్న ఉమెన్ ఎంపవర్‌మెంట్ కమిటీ సభ్యులు 250మంది హాజరవుతున్నారు. పార్లమెంటు స్పీకర్ ఓంబిర్లా, రాజ్యసభ డిప్యూటీ ఛైర్‌పర్సన్ హరివంశ్ నారాయణసింగ్, సీఎం చంద్రబాబునాయుడు తదితరులు హాజరై 14న ఉదయం 10.30గంటలకు సదస్సును ప్రారంభించనున్నారు. మొదటి రోజు మహిళల సాధికారత, నాయకత్వం, రాజకీయ రంగాల్లో మహిళల భాగస్వామ్యం తదితర అంశాలపై చర్చిస్తారు. అదేరోజు సాయంత్రం 7గంటలకు స్పీకర్ చింతకాయల అయన్నపాత్రుడు నేతృత్వంలో చంద్రగిరి కోట వద్ద లైటింగ్‌షో ఏర్పాటు చేసి విందు ఇవ్వనున్నారు. 15న ఉదయం డెలిగేట్లు తిరుమల శ్రీవారిని దర్శించుకుంటారు. ఉదయం 10.30గంటలకు సదస్సు ప్రారంభమవుతుంది. అనంతరం జరిగే ముగింపు కార్యక్రమానికి గవర్నర్ అబ్దుల్ నజీర్ హాజరు కానున్నారు. ఆ తర్వాత సభ్యులు శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించుకుని షార్‌ను సందర్శించనున్నారు. అతిథుల కోసం తిరుపతిలోని స్టార్ హోటళ్లలో గదులు బుక్ చేశారు. సదస్సు జరిగే కన్వెన్షన్ సెంటర్ పక్కన 400 వాహనాల పార్కింగ్‌కు సిద్ధం చేస్తున్నారు.

సమన్వయంతో విధులు నిర్వహిద్దాం

తిరుపతిలో జరగనున్న జాతీయ మహిళా సాధికారత సదస్సు విజయవంతానికి సమన్వయంతో విధులు నిర్వహిద్దామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్‌తో కలిసి ఆయన సదస్సు ఏర్పాట్లపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. డెలిగేట్లకు వసతి, రవాణా, భద్రత, వైద్యసదుపాయాలు, ప్రొటోకాల్ ఏర్పాట్లపై విభాగాల వారీగా అధికారులకు విధులు కేటాయిస్తామన్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. లైజాన్ అధికారులకు స్మార్ట్ సిటీ జనరల్ మేనేజరు చంద్రమౌళి శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, శాసనసభ సెక్రటరీ జనరల్ కార్యాలయ సిబ్బంది, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- మత సామరస్యానికి ప్రతీక
- బంధుమిత్రుల సంగమ వేదిక



పోలేరమ్మ శిలాప్రతిమకు ప్రత్యేక పూజలు

నేటి నుంచి పోలేరమ్మ జాతర

- రాత్రికి కొలువుదీరనున్న అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో పోలేరమ్మ (ఫైల్ ఫొటో)

వెంకటగిరి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పోలేరమ్మ పుట్టినిల్లు కుమ్మరిల్లు. మెట్టినిల్లు చాకలిల్లు. ఇలా 18 కులాల భాగస్వామ్యంతో వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మ జాతర బుధవారం మొదలు కానుంది. ఒక్కో కులానికి ఒక్కో బాధ్యత ఉంటుంది. కుల, మత సామరస్యతకు ఈ జాతర ప్రతీక. దేశ, విదేశాల్లోని బంధుమిత్రులు తరలివచ్చి వారం రోజులపాటు సంతోషంగా గడిపేందుకు ఈ జాతర ఒక వేదిక. బుధ, గురువారాల్లో పోలేరమ్మ జాతర జరిగినా.. ఆదివారం ఘటోత్సవంతోనే వెంకటగిరిలో సందడి మొదలైంది. ఒక్కో రోజు ఒక్కో కార్యక్రమంతో జాతర వాతావరణం నెలకొంది. ఇక, బుధవారం తెల్లవారే అమ్మవారి పుట్టినింటి వారైన కుమ్మరివారు వెంకటగిరి చెరువు నుంచి బంకమట్టి తీసుకు రానున్నారు. మధ్యాహ్నం రాహుకాలం ముగిశాక ఆ మట్టిని పసుపుతో కలిపి సాయంత్రం 4 నుంచి 6 గంటల్లోపు అమ్మవారి ప్రతిమను తయారు చేస్తారు. కళ్లు, దిష్టి చుక్క ఎటువంటి అలంకారం లేకుండా భక్తుల దర్శనార్థం ఉంచుతారు. అక్కడి నుంచి అమ్మవారి ప్రతిమకు తెల్లగుడ్డతో ముసుగు వేసి కట్టెలతో చేసిన పల్లకిపై అమ్మవారి అత్తవారిల్లుగా భావించే జీనిగలవారి వీధిలోని చాకలింటి వద్దకు రాత్రి 9.30 నుంచి 10.30 గంటలకు తీసుకెళతారు. పురవీధుల్లో ఊరేగుతూ పూజలందుకుంటున్న అమ్మవారి విశ్వరూపంగా భావించే బలి దున్నపోతు, ఘటుంకుండలు కాంపాళెంకు వచ్చి అరవపాళేనికి చేరుకోవడంతో ఘటుం కార్యక్రమం ముగుస్తుంది. సుమారు 11 గంటల సమయంలో కాంపాళెం వద్ద అమ్మవారి అప్పచెల్లెళ్లుగా భావించే గాలిగంగలకు పూజలు చేసి పొట్టేలును బలిచ్చి అమ్మవారికి తొలి నైవేద్యం చెల్లించడంతో పాటు ఆచార సంప్రదాయాలతో గాలిగంగల సారెలను ముగిస్తారు. గాలిగంగలు జీనిగలవారి వీధిలోని చాకలింటికి చెరుకొని అమ్మవారి ముందు నిలవడంతో కోడితలను నోటితో కొరికి అమ్మవారికి కళ్ళు, దిష్టిచుక్కను ఏర్పాటు చేసి ఆభరణాలతో అలంకరిస్తారు. విద్యుద్దీపాలు, పూలతో అలంకరించిన చప్పరంపై అమ్మవారిని ఊరేగింపుగా తీసుకు వచ్చి గురువారం తెల్లవారు జామున పోలేరమ్మ దేవస్థానం వద్ద వేపమండలతో సిద్ధం చేసిన మండపంలో కొలువుదీర్చనున్నారు. అమ్మవారిని గురువారం భక్తులు దర్శించుకుంటారు.

ఆచార సంప్రదాయాలు పాటిస్తూ..

పోలేరమ్మ జాతర అనాదిగా వస్తున్న ఆచార వ్యవహారాలను పాటిస్తారు. ఆ ప్రకారం.. జాతర సందర్భంగా ఇళ్లలో నట్టింట గోడపై ఎర్రమట్టితో అలికి పసుపు కుంకుమతో అమ్మవారి ప్రతిమను సిద్ధంచేసి పూజలు చేస్తారు. అంబలితో పాటు కరవాడు, వంకాయ పులుసును అమ్మవారి నైవేద్యంగా సమర్పిస్తారు. చిన్నా, పెద్ద.. బీదా, ధనిక తేడా లేకుండా బుట్టలు, గిన్నెలు చేతబట్టి ఇలిల్లూ తిరుగుతూ పోలేరమ్మకు మడి భిక్షం పెట్టండంటూ భిక్షాటన చేసి మొక్కులు చెల్లించుకొంటారు.

వారికి న్యాయం చేస్తాం

- ఆ రెండింటినీ విత్‌హెల్డ్‌లో పెడుతున్నామన్న స్విమ్స్ డైరెక్టర్

తిరుపతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పలువురు వైద్య అభ్యర్థులకు అన్యాయం జరుగుతుందన్న విమర్శల నేపథ్యంలో స్విమ్స్ ఫ్యాకల్టీ నోటిఫికేషన్‌పై టీటీడీ పునరాలోచించింది. సహేతుకంగాలేని డెంటిస్ట్రీ, నాన్ క్లినికల్ పోస్టులను హోల్డ్ చేస్తూ తక్కిన వాటికి యథావిధిగా రిక్రూట్‌మెంట్ చేయనున్నట్టు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్వీ కుమార్ 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి చెప్పారు. డెంటిస్ట్రీ పోస్టును వైసీపీ నేతకు అనుకూలంగా 'ఓరల్ మ్యాక్సిల్లో ఫేషియల్ సర్జరీ'గా నోటిఫికేషన్‌లో పేర్కొన్నారన్న ఆరోపణలపై 'నేను చెప్పిన అభ్యర్థికే పోస్టు దక్కాలి' శీర్షికన ఈనెల 4న ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. అలాగే, స్విమ్స్ వర్సిటీలో పీజీ, పీహెచ్‌డీ చేసిన నాన్ క్లినికల్ అభ్యర్థులను నోటిఫికేషన్‌కు టీటీడీ దూరంపెట్టిందని 'చదువుచెప్పిన చోటే వద్దంటోంది' శీర్షికన 6వతేది మరో కథనం ప్రచురితమైంది. ఈనేపథ్యంలో స్విమ్స్, టీటీడీ ఉన్నతాధికారులు పునరాలోచించారు. వాటిని హోల్డ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు. టీటీడీ నిర్వహణలోని స్విమ్స్‌లో 9 ప్రొఫెసర్లు, 20 అసోసియేట్ ప్రొఫెసర్లు, 67 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకానికి గతనెల 14న నోటిఫికేషన్ జారీ అయింది. ఈ నోటిఫికేషన్‌లో బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, కమ్యూనిటీ మెడిసిన్‌కు ఎండీ, ఎంస్ లేదా డీఎస్సీ అర్హతలు కావాలని నిర్ధేశించింది. దీంతో స్విమ్స్‌లోనే చదివిన ఎంఎస్సీ/పీహెచ్‌డీ అభ్యర్థుల పట్ల అన్యాయంగా వ్యవహరించిందన్ని ఆంధ్రజ్యోతి కథనాన్ని ప్రచురించింది. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ చట్టం 1956 ప్రకారం ఎమ్మెస్సీ/పీహెచ్‌డీను మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా తీసుకోవచ్చు. అలాకాకుండా ఎండీ, ఎంఎస్/డీఎస్సీ ఉండాలని నిబంధన పెట్టడం, అదేవిదంగా డెంటిస్ట్రీ పోస్టును 'ఓరల్ మ్యాక్సిల్లో ఫేషియల్ సర్జరీ' చేసిన అభ్యర్థులు కావాలని చెప్పడంపై విమర్శలకు దారితీసింది. ఈనేపథ్యంలో వాటి రిక్రూట్‌మెంట్‌ను పక్కన పెడుతూ నిర్ణయం తీసుకున్నట్టు డైరెక్టర్ తెలిపారు. నోటిఫికేషన్‌లోని 104 పోస్టులకు గాను 315 దరఖాస్తులు వచ్చాయన్నారు. ప్రస్తుతం స్క్రూటినీ జరుగుతోందన్నారు. తర్వాత ఎంఎస్సీ, పీహెచ్‌డీ చేసినవారికి అవకాశం ఉంటుందన్నారు. అభ్యంతరాలతో పాటు తుది జాబితాను టీటీడీ ఛైర్మన్, ఈవో దృష్టికి తీసుకెళతామన్నారు. ఫ్యాకల్టీ నోటిఫికేషన్ పూర్తిగా రద్దయిందన్న వార్తల్లో నిజంలేదన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గుత్తివారిపల్లె ఘటనపై కలెక్టర్ ఆగ్రహం

- ఈవోపీఆర్డీ సస్పెన్షనుకు ఆదేశాలు
- ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, వీఆర్వోలపైనా చర్యలు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం గుత్తివారిపల్లెలో డయేరియాతో ఒకరు మృతిచెందిన ఘటనపై కలెక్టర్ వెంకటేశ్వర్ సీరియస్ అయ్యారు. ఈవోపీఆర్డీ ప్రభురెడ్డిని సస్పెండు చేయాలంటూ డీపీవో సుశీలాదేవిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం పలు అంశాలపై ఆయన అధికారులతో చర్చించారు. గుత్తివారిపల్లెలో డయేరియా ఘటనను ప్రస్తావిస్తూ అనూహ్య సంఘటనలు జరిగితే వెంటనే ఉన్నతాధికారులకు సమాచారమివ్వకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డయేరియా విషయంలో నిర్లక్ష్యం వహించిన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, వీఆర్వోపై చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్ సూపర్‌వైజర్లనూ బాధ్యుల్ని చేయాలన్నారు. యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో కమిషనర్ మౌర్య, జేసీ శుభం బన్సల్ తదితరులు పాల్గొన్నారు.

జాతరకు డ్రోన్ల నిఘా

- 950 మంది పోలీసు బలగాలతో బందోబస్తు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరి జాతరకు ఈసారి ఐదు డ్రోన్లతో నింగి నుంచీ నిఘా పెట్టనున్నారు. ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 12 సీసీ కెమెరాలూ ప్రతి సంఘటననూ క్యాప్చర్ చేయనున్నాయి. గత ఐదేళ్ల అనుభవాలు, ఘటనలను దృష్టిలో ఉంచుకుని ఎస్పీ హర్షవర్ధనరాజు భద్రతా చర్యలు చేపట్టారు. ఇప్పటికే అదనపు ఎస్పీ రవి మనోహరాచ్చారి, ఎస్పీ డీఎస్పీ వెంకటనారాయణ, సీఐలు, ఎస్ఐలు ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి, స్థానిక నాయకులతో సమావేశమై జాతర ఏర్పాట్లపై చర్చించారు. బుధ, గురువారాల్లో పోలేరమ్మ జాతరకు 950 మందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎస్టీఎఫ్.. మూవింగ్ పార్టీలనూ నియమించారు. జాతరలో ఊరేగింపుతో పాటు నిమజ్జనం, భక్తుల తాకిడి ఎక్కువగా వున్న ప్రాంతాల్లో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్‌లు ఏర్పాటుచేసి భక్తులకు అవగాహన కల్పించేలా సిబ్బందిని నియమించారు. మరోవైపు గూడూరు డివిజన్ పరిధిలోని ఆకతాయిలు, రౌడీ షీటర్లు, మద్యం మత్తులో గొడవలు సృష్టించే వారిని బైండోవర్ చేసుకుని సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. భక్తుల వాహనాలకు 8 పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటు చేశారు. వాహనాలన్నీ వచ్చే దారిలోనే తిరిగి వెళ్లేలా రూట్ మ్యాప్‌లు సిద్ధం చేశారు.



తోక జాడిస్తే జైలుకే

ప్రశాంతంగా జాతర నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలి. ఎవరైనా విఘాతం కలిగించడానికి ప్రయత్నిస్తే జైలుకు పంపిస్తాం. రద్దీ ఎక్కువగా ఉండే చోట డ్రోన్లు వినియోగించి ఆకతాయిల ఆగడాలను కట్టడి చేస్తాం. గతేడాది జాతరలో అల్లర్లు సృష్టించిన వారి కదలికలపై నిఘా ఉంచాం.

- హర్షవర్ధనరాజు, ఎస్పీ

అనధికార శ్రీనివాస కల్యాణాలు నిర్వహిస్తే చర్యలు: టీటీడీ

తిరుమల, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): విదేశాల్లో అనధికారిక శ్రీనివాస కల్యాణాలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని టీటీడీ హెచ్చరించింది. యూకేలోని శ్రీఅద్వైత సేవా సమితి పేరుతో ఓ సంస్థ యూనైటెడ్ కింగ్డమ్‌లో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టుగా ఆహ్వానపత్రికను వాట్సాప్ గ్రూపుల్లో వైరల్ చేశారు. దీనికి ఏపీఎన్ఆర్టీఎస్ నుంచి అనుమతి లేదని టీటీడీ స్పష్టంచేసింది. ఆహ్వాన పత్రికలో టీటీడీ లోగోను వాడటం భక్తులను తప్పుదోవ పట్టించడమేనని పేర్కొంది.

సైబర్ వలలో ప్రొఫెసర్ కుమార్తె

- రూ.90వేలకు టోకరా

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మ్యారేజా బ్యూరో ముసుగులో పరిచయం పెంచుకున్న ఓసైబర్ మోసగాడి వలలో ఒక ప్రొఫెసర్ కుమార్తె మోసపోయింది. రూరల్ సీఐ చిన్నగోవిందు కథనం మేరకు వెటర్నరీ వర్సిటీలో ఓ ప్రొఫెసర్ కుమార్తెకు తెలుగు మ్యాట్రిమోనీ ద్వారా సంజయ్ అనే పేరుతో ఓ వ్యక్తి పరిచయమయ్యాడు. మ్యారేజీ బ్యూరో పేరిట మాటలు చెబుతూ నమ్మపలికాడు. ఈ నెల 3న అత్యవసరంగా రూ.90,000 కావాలని వాట్సాప్ కాల్ ద్వారా అడిగాడు. ఆమె నమ్మి అతడు సూచించిన నంబరుకు ఆమొత్తాన్ని ఫోన్ ద్వారా బదిలీ చేసింది. తర్వాత ఇతడు ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. తాను మోసపోయానని గ్రహించిన బాధితురాలు పోలీసులకు ఫిర్యాదుచేసింది.

యూరియా కొరతను అరికట్టండి

- వైసీపీ నేతల డిమాండు.. ఆర్డీవోకు వినతి



తిరుపతి ఆర్డీవో కార్యాలయం వద్ద వైసీపీ నేతల నిరసన

తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): యూరియా కొరతను అరికట్టి, రైతు సమస్యలపై స్పందించాలని వైసీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్ డిమాండ్ చేశారు. పార్టీ పిలుపు మేరకు మంగళవారం తిరుపతిలోని అన్నమయ్య సర్కిల్‌నుంచి ర్యాలీగా వెళ్లి ఆర్డీవోకు వినతిపత్రం ఇచ్చారు. యూరియా కొరతను ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పీఏసీలకు చేరాల్సిన 50శాతం యూరియాని దారిమళ్లించి ప్రైవేటు వ్యక్తులు కొరతను సృష్టించి బ్లాక్‌లో అమ్ముతున్నారని ఆరోపించారు. రైతు సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన తీవ్రం చేస్తామని మేయర్ డాక్టర్ శిరీష, వైసీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నేతలు చంద్రమౌళిరెడ్డి, మాధవరెడ్డి, మల్లం రవిచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ మునికృష్ణ, లక్ష్మీనారాయణ శివశంకర్‌రాజు, అశోక్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వైసీపీ చేపట్టిన ర్యాలీలో రైతుల కన్నా యువతే ఎక్కువగా కనిపించారు. 50మంది తక్కువ కాకుండా తీసుకరావాలని కార్పొరేటర్లు, ప్రధాన లీడర్లకు స్థానిక అధిష్ఠానం ఆదేశించినట్లు సమాచారం. దీంతో వాళ్లంతా యువతను, మహిళలను వెంటబెట్టుకుని వచ్చారు. రైతులు చాలా తక్కువ సంఖ్యలో కనపడ్డారు. కాగా, జిల్లాలోని గూడూరు, సూళ్లూరుపేట, శ్రీకాళహస్తి ఆర్డీవోలకూ అక్కడి వైసీపీ నేతలు వినతిపత్రాలిచ్చారు.

20.84 లక్షల మందికి ఉచిత ప్రయాణం

- ఆ బస్సులపై స్త్రీశక్తి లోగో వేయాలన్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో స్త్రీశక్తి పథకం ప్రవేశపెట్టినప్పటి నుంచి మంగళవారం వరకు 20.84లక్షల మంది మహిలు ఆర్టీసీలో ఉచితంగా ప్రయాణించారని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. తద్వారా వారు సుమారు రూ.8.66 కోట్లు లబ్ధి పొందారన్నారు. జిల్లాలోని 11మంది ఆర్టీసీ డిపో మేనేజర్లతో మంగళవారం కలెక్టర్ జూమ్‌మీటింగ్ నిర్వహించారు. ఈ పథకం అమలయ్యాక తిరుపతి నుంచి శ్రీకాళహస్తి, సత్యవేడు, పుత్తూరు, చిత్తూరు, గూడూరు ప్రాంతాల్లో వారాంతం, పండుగ రోజుల్లో అదనపు బస్సులను ఏర్పాటు చేయాలని డీఎంలను ఆదేశించారు. ఉచిత ప్రయాణ సదుపాయమున్న బస్సులను మహిళలు సులభంగా గుర్తించేలా వాటిపై స్త్రీశక్తి లోగోను ఏర్పాటు చేయాలన్నారు. ఈ బస్సుల వేళలు, వాటి ట్రాకింగ్‌యాప్‌ను రూపొందించాలన్నారు.

యూరియా మోతాదు మించితే వరికి చీడపీడలు



రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

రామచంద్రాపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులు సేంద్రియ ఎరువులను వాడాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ ప్రిన్సిపాల్, శాస్త్రవేత్త డాక్టర్ రామకృష్ణారావు సూచించారు. మంగళవారం వీవీపురం పంచాయతీలోని సంజీవరాయపురంలో పొలం పిలుస్తోంది, భూరక్షణ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలను చేశారు. ఎకరా వరికి 105 కిలోల యూరియా వేయాలన్నారు. అధికంగా వేస్తుండటం వల్ల చీడపీడలు ఆశించి దిగుబడులు తగ్గిపోతున్నాయన్నారు. భూములు కూడా నిస్సారమవుతున్నాయన్నారు. వేరుశనగ, మామిడి పంటలను కూడా పరిశీలించారు. వ్యవసాయాధికారి మమత, రైతు సేవాకేంద్రం వీహెచ్ఏ జాహ్నవి, రైతు సాధికార సంస్థ సౌందర్య పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన



రామచంద్రాపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్శిటీ సామాజిక శాస్త్ర విభాగం పీజీ విద్యార్థులు మండలంలో మంగళవారం గ్రామీణ విస్తరణ కార్యక్రమం నిర్వహించారు. కమ్మపల్లి, అరుంధతివాడ, తదితర ప్రాంతాల్లో ప్రజలకు సామాజిక సమస్యలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి ప్రజలు, రైతులు నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఎంఈవో మార్కొండయనాయుడు, కమ్మపల్లి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సభాపతి, ప్రొఫెసర్ జానకిరామయ్య, అధ్యాపకులు కుసుమ, వెంకటేశ్వర్లు, ముకుందనాయుడు, రమణయ్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలలో ఉచిత శిక్షణ

చంద్రగిరి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ద్వారకానగర్ యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 15 నుంచి ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ సురేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తెల్ల రేషన్ కార్డు కలిగి 19 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసున్న గ్రామీణ పురుషులు, మహిళలు శిక్షణకు అర్హులని తెలిపారు. కనీసం పదోతరగతి చదివి ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు సంస్థ ఫోన్ ద్వారా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫొటోలతో సంస్థకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్..7989680587, 9494951289, 6301717672 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

రహదారిలో వరద నీటి నిల్వకు చెక్



వెంకటంపేట వద్ద పైపు లైన్ నిర్మాణ పనులు

చంద్రగిరి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వెంకటంపేట వద్ద చంద్రగిరి ఫ్లైఓవర్ నుంచి తిరుపతి ప్రధాన రహదారిలో రోడ్డుపై వరద నీరు నిల్వకుండా అధికారులు చర్యలు చేపట్టారు. చినుకు పడితే ఈదారిలో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడేది. చాన్నాళ్లుగా దీనిపై ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ఎమ్మెల్యే పులివర్తి నాని స్వయంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. గతంలో కూడా రోడ్డుకు ఇరువైపులా కాలువలు తీసినా ప్రయోజనం లేకుండా పోయింది. చివరికి రోడ్డు కింది భాగంలో పైపులైన్ ఏర్పాటు చేయడానికి గోతులు తీశారు. వరద నీరు రోడ్డుపై నిల్వకుండా ఉండేందుకు పటిష్ఠంగా పనులు చేపడుతున్నారు. ఈపనులు పూర్తైయితే వదర నీరు మురుగు కాలువలో కలిసేలా చర్యలు తీసుకుంటున్నారు.

డీలర్లకు ఈ-పాస్ పరికరాల అందజేత



తిరుపతి రూరల్, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): మండలంలోని రేషన్‌షాప్ డీలరకు మంగళవారం స్థానిక ఏఎస్‌వో కార్యాలయంలో ఈపాస్ పరికరాలను అందజేశారు. పౌరసరఫరాశాఖ డీటీ యుగంధర్ వీటిని అందించారు. ఈ పరికరాలను వినియోగించే విధానంపై అవగాహన కల్పించారు. డీలర్ల సంఘ మండల అధ్యక్షుడు, రాష్ట్రకార్యదర్శి గుత్తా కోటేశ్వరనాయుడు, ఆర్సీపురం మండల అధ్యక్షురాలు రజని, విజన్‌టెక్ ప్రతినిధి వీరేంద్ర, డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

కదలని మురుగు నిల్వతో కష్టాలు



ఖాళీస్థలంలో మురుగునీరు

తిరుపతిరూరల్, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంట పంచాయతీలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగునీరు, టాయిలెట్ వ్యర్థాలు ఇళ్లమధ్య ఖాళీ స్థలాల్లో చేరుతున్నాయి. ఈమురుగు కదలక దుర్వాసన భరించలేక స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఎస్సీకాలనీ కూడలి, అంకాళమ్మ గుడి ఎదురుగా ఉన్న ఖాళీస్థలంలో ముళ్లచెట్ల మధ్యలో మురుగునీరు చేరుతోంది. పంచాయతీ పాలకులు పట్టించుకోవడంలేదని కాలనీప్రజలు వాపోతున్నారు. అనారోగ్యాల బారిన పడుతున్నామని, దోమల బెడద అధికమైందని వాపోతున్నారు. మరోపక్క పలు రోడ్లు కంకరతేలి గుంతలమయంగా మారాయి.

గుండెపోటుతో ఆరిమేనిపాడు ఎంపీటీసీ మృతి



రఘురామరాజు (ఫైల్‌ఫొటో)

ఓజిలి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం ఆరిమేనిపాడు గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు గుంటమడుగు రఘురామరాజు(65) గుండె పోటుతో మృతి చెందారు. గూడూరులోని కుమారుడి ఇంట్లో ఉంటున్న ఆయనకు మంగళవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో కన్నుమూశారు. భౌతికకాయాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్య క్రియలు పూర్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీ వయ్య, వెంకటగిరి వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాం కుమార్‌రెడ్డి, ఓజిలి మండల వైసీపీ కన్వీనరు పాదర్తి హరినాద్‌రెడ్డి తదితరులు ఆరిమేనిపాడుకు గ్రామానికి వెళ్లి రఘురామరాజు భౌతికకాయానికి నివాళులర్పించారు.

వైభవంగా కట్ట పుట్టాలమ్మ జాతర



ఆలయం ముందు కుంభం

రేణిగుంట, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): కట్ట పుట్టాలమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. కరకంబాడి సమీపంలో ఉన్న అమ్మవారి ఆలయంలో మంగళవారం ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. జాతర సందర్భంగా చుట్టుపక్క గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా డీఎస్పీ శ్రీనివాస రావు నేతృత్వంలో గాజులమండ్యం, రేణిగుంట అర్బన్ పోలీసులు భద్రతా ఏర్పాట్లను చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పాడి రాజేంద్ర, కమిటీ సభ్యుడు కె.వి చలం, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి బుజ్జి నాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముక్కంటి సేవలో మాల్కాజ్‌గిరి ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని మంగళవారం తెలంగాణ రాష్ట్రం మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మల్లారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామిసన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

పాముకాటుకు ఆవు మృతి

రామచంద్రాపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): గంగిరెడ్డిపల్లె పొలాల్లో మంగళవారం మధ్యాహ్నం పాము కాటుకు ఓ ఆవు మృతి చెందింది. గ్రామానికి చెందిన ప్రసాద్ తన మూడు పాడిఆవులను తీసుకుని మంగళవారం ఉదయం మేతకు పొలాలకు వెళ్లారు. మధ్యాహ్నం 3గంటలకు పొలం వద్ద ఓ ఆవు నురగ కక్కి మృతి చెందింది. లక్షణాలను బట్టి పాము కాటుకు గురై మృతి చెందినట్లు భావిస్తున్నారు.

తుడా చైర్మన్‌కు సత్కారం



దివాకర్‌రెడ్డిని సత్కరిస్తున్న నిరంజన్‌బాబు

రామచంద్రాపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డిని మంగళవారం తుడా కార్యాలయంలో సెవెన్‌హిల్స్ ఫార్మసీ కళాశాల చైర్మన్ డాక్టర్ నిరంజన్‌బాబు, వికాస్ పరిషత్ అధ్యక్షులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దివాకర్‌రెడ్డిని వారు సత్కరించి అభినందనలు తెలిపారు.

స్విమ్స్ డీన్‌గా అలోక్‌సచన్



తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ డీన్‌గా ఎండోక్రైనాలజీ విభాగాధిపతి డాక్టర్ అలోక్‌సచన్‌ను నియమితులయ్యారు. ఈ మేరకు డాక్టర్ అలోక్‌సచన్‌కు డైరెక్టర్ ఆర్వీకుమార్ మంగళవారం నియామక పత్రాన్ని అందజేశారు. దీంతో అలోక్‌సచన్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు వైద్య విభాగాధిపతులు, వైద్యులు అభినందనలు తెలిపారు. కాగా ఇదివరకు డీన్‌గా కొనసాగిన మెడిసిన్ విభాగాధి పతి డాక్టర్ అల్లాడి మోహన్ పదవీకాలం ముగియడంతో అలోక్‌సచన్‌ను డీన్‌గా నియమించారు.

తిరుమలలో యువకుడి మృతి



తిరుమల, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): గుర్తు తెలియని యువకుడు తిరుమలలో మృతి చెందాడు. బాటగంగమ్మ ఆలయం నుంచి శేషతీర్థానికి చేరుకునే దారిలో సుమారు 20ఏళ్లున్న యువకుడు చెట్టుకు ఉరివేసుకుని ఉండటాన్ని కొందరు స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారమిచ్చారు. టూటౌన్ పోలీసులు చేరుకుని యువకుడి మృతదేహాన్ని కిందకు దింపారు. రెండు రోజుల క్రితమే మృతిచెందినట్టు భావిస్తున్నారు. మృతుని వివరాలు తెలిసినవారు 94407 96772 నెంబరుకు తెలియజేయాలని పోలీసులు కోరారు.

ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



నాగలాపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసు కుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. వివరాలు ఇలా... మండలంలోని మలిమేలుకండ్రిగ వద్ద అరణియార్ నదిలో సోమవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఎస్ఐ సునీల్ సిబ్బందితో దాడి చేశారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేశారు.

పోలేరమ్మ జాతర సందడి



పోలేరమ్మ ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణ

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గ్రామశక్తి పోలేరమ్మ జాతర సందడి మొదలైంది. బుధ, గురువారాల్లో జాతర నిర్వ హించేందుకు దేవదాయశాఖ, మున్సిపాలిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి ఒక్కరికీ అమ్మవారి దర్శనం కలిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం ఘటోత్సవంతో జాతర మొదలైన విష యం తెలిసిందే. అప్పటి నుంచే వివిధ ప్రాంతా నుంచి వచ్చిన కళాకారులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు. పోలేరమ్మ ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణతో ఆకట్టుకుంటోంది. పలు కూడళ్లలో కటౌట్లు ఏర్పాటు చేశారు. అమ్మవారి ఊరేగింపు జరిగే రాజవీధిలో చెట్ల కొమ్మలను తొలగించారు.

పేదల ఆరోగ్యానికి అభయం

● అర్హులందరికీ పీఎంజేఏవై కార్డులు ● ఆరోగ్య వివరాలు కంప్యూటర్లో నిక్షిప్తం

చంద్రగిరి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు ఆయుష్మాన్ భారత్ ప్రధానమంత్రి జన్ ఆరోగ్యయోజన(పీఎంజేఏవై) పథకం ఆరోగ్య భరోసా కల్పించనుంది. తమ పరిధిలోని ఏ ప్రభుత్వాస్పత్రి లేదా పీహెచ్‌సీలోనైనా వైద్య సేవలకు ఈ పథకం వీలు కల్పించనుంది. పేదలందరూ దీనికి కింద లబ్ధి పొందేందుకు అర్హతగా నిర్దేశించింది. ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకం కింద ఐడీ కార్డులను అర్హులకు అందజేస్తోంది. ఇప్పటికే కార్డులు పొందిన వారు ప్రభుత్వ అనుపత్రుల్లో వైద్య సేవలు పొందుతున్నారు. ఐడీ రూపొందించే సమయంలో ఫోన్, ఆధార్ నంబర్ వంటి వివరాలు నమోదు చేస్తున్నారు. ఆరోగ్య ఇబ్బందులు, వయసు, మందులు, చేసిన పరీక్షలు వంటి వివరాలు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. దీనివల్ల ప్రతిసారీ రోగి తన ఆరోగ్య వివరాలను, రిపోర్డులు తీసుకెళ్లాల్సిన అవసరం లేదు. కార్డుతో ఏ ప్రభుత్వాస్పత్రిలోనైనా డిజిటల్ ప్రక్రియ ద్వారా వైద్యం చేయించుకోవచ్చు మండలంలో చంద్రగిరి పీహెచ్‌సీలో 35,895 మంది జనాభాకు గాను 35,233మందికి, కొటాల పీహెచ్‌సీ పరిధిలో 18,340 మందికి 16,608 మందికి ఈ కార్డులు పొందారని వైద్యాధికారులు చెప్పారు. ఇన్నాళ్లూ వెళ్లిన ప్రతిసారీ ఓపీ దగ్గర ఎక్కువ సమయం పట్టేది. ఈ ఐడీ కార్డు వల్ల సమయం కూడా ఆదా అవుతుంది. ఒక క్లిక్ ద్వారా వైద్యుడు మొత్తం వివరాలు తెలుసుకోవచ్చు. త్వరలోనే ప్రవేటు ఆసుపత్రుల్లో కూడా సేవలు పొందే అవకాశముందని భావిస్తున్నారు.



అందరూ సద్వినియోగం చేసుకోవాలి



ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్ళినపుడు రోగుల తమ ఐడీ కార్డులను తప్పనిసరిగా వెంట తీసుకువెళ్లాలి. ఓపిలో నమోదు చేయించుకోవాలి. రోగి వివరాలు ఆన్‌లైన్‌లో ఉండటం వల్ల పూర్వ పరిస్థితిని వైద్యులు త్వరగా తెలుసుకుని వైద్యం చేయడానికి వీలుంటుంది. -డాక్టర్ ప్రియాంక. పీహెచ్‌సీ, కొటాల

రాధాకృష్ణన్ విజయంపై బీజేపీ సంబరాలు



జాతీయ పతాకాలను ప్రదర్శిస్తున్న బీజేపీ నాయకులు.

తిరుపతి(ఉపాధ్యాయ నగర్), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): భారత ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీఏ అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ విజయం సాధించడంతో మంగళవారం రాత్రి తిరుపతిలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారు. గోవిందరాజస్వామివారి ఆలయ దక్షిణ మాడవీధిలో రాధాకృష్ణన్ చిత్రపటాలు, జాతీయ పతాకాలు చేతబూని నినాదాలు చేశారు. ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు. బీజేపీ సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, గుండాల గోపీనాథ్‌రెడ్డి, సుబ్రహ్మణ్యంయాదవ్, చంద్రబాబుయాదవ్, మస్తాన్, సుబ్రహ్మణ్యం రెడ్డి, అన్నారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కేఎస్ రాజ తదితరులు పాల్గొన్నారు.

తిరుపతి(ఉపాధ్యాయనగర్): భారత ఉపరాష్ట్రపతిగా ఎన్డీఏ కూటమి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్ ఎన్నిక కావడంపట్ల బీజేపీ రాష్ట్ర అధికారప్రతినిధి జల్లి మధుసూదన్ మంగళవారం రాత్రి హర్షం వెలిబుచ్చారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన విజయానికి కృషిచేసిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు.

కుటుంబ సభ్యులకు మహిళ అప్పగింత



స్వాతిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న సీఐ

తిరుమల, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులకు చెప్పకుండా తిరుమలకు వచ్చి ఉంటున్న ఓ వివాహితను తిరుమల పోలీసులు గుర్తించి తిరిగి అప్పగించారు. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. విశాఖపట్నం జిల్లాకు చెందిన స్వాతి(38)కి 2013లో నవీన్ అనే వ్యక్తితో పెళ్లయింది. తొలినాళ్లలో ఈ దంపతులు లండన్‌లో ఉండేవారు. తర్వాత వీరిమధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. ఈక్రమంలో 2021లో స్వాతి లండన్ నుంచి వచ్చేసింది. తల్లిదండ్రుల వద ఉంటోంది. ఇటీవల తల్లి చనిపోయింది. దీంతో మనోవేదన చెందిన స్వాతి 10 రోజుల క్రితం తిరుమల చేరుకుంది. ఆమె తండ్రి గోవిందరావు గాజువాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణలో స్వాతి తిరుమలలో ఉన్నట్టు గుర్తించారు. తిరుమల పోలీసుల సహకారంతో వారు మంగళవారం ఆమెను అదుపులోకి తీసుకున్నారు. తిరుమలకు చేరుకున్న కుటుంబ సభ్యులకు అప్పగించారు. అంతకుముందు ఆమెకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

అనంత సభ పర్యవేక్షణలో అమర్, నాని



చిత్తూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అనంతపురం శివారులోని జీఎంఆర్ ఇంద్రప్రస్థ మైదానంలో బుధవారం నిర్వహించనున్న 'సూపర్ సిక్స్. సూపర్ హిట్ సభ ఏర్పాట్ల పర్యవేక్షణలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన టీడీపీ, జనసేన నేతలు కూడా పాల్గొంటున్నారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సీఎం చంద్రబాబు ఒక్కో హామీ నెరవేర్చుకుంటూ వస్తున్నారు.పెన్షన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, ఉచిత బస్సు ప్రయాణం వంటి పథకాలను అమలు చేసిన నేపథ్యంలో నేడు అనంతపురం వేదికగా 'సూపర్ సిక్స్. సూపర్ హిట్' పేరుతో భారీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. సీఎం, డిప్యూటీ సీఎం సహా కీలక నాయకులు హాజరుకానున్నారు.సభా ఏర్పాట్లను పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు పర్యవేక్షిస్తున్నారు.వీరిలో ఎమ్మెల్యేలు అమరనాథ రెడ్డి, పులివర్తి నాని, ఆరణి శ్రీనివాసులు తదితరులున్నారు

బస్సుల కొరతతో తప్పని నిరీక్షణ



తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సెంట్రల్ బస్సు స్టేషన్‌లో మంగళవారం బస్సుల కొరత ఏర్పడింది. బుధవారం అనంతపురంలో జరగనున్న 'సూపర్‌సిక్స్ సూపర్‌సక్సెస్' సభకు జనసమీకరణ కోసం జిల్లాలోని వివిధ డిపోల నుంచి 327 బస్సులను ఒకరోజు ముందుగానే తరలించారు. ఈ క్రమంలో తిరుమల ఘాట్‌తో సహ ఆయా రూట్స్‌లో రద్దీని సమీక్షించుకొని మిగులు బస్సులను ఎంపిక చేశారు. వెంకటగిరిడిపో నుంచి ఒక్క బస్సు కూడా తరలించలేదు. ఎంపిక చేసిన బస్సులు ఉదయం తిరుపతి బస్టాండు నుంచి క్రమంగా పయనమయ్యాయి. దీంతో వివిధ ప్రాంతాల నుంచి సీబీఎస్‌కు 40శాతం బస్సులు తగ్గుముఖం పట్టాయి. ప్రధానంగా ఏడుకొండల బస్టాండు, పల్లెవెలుగు బస్టాండుల వద్ద బస్సుల కోసం నిరీక్షణ, వచ్చిన బస్సును వెంబడించడం, సీట్ల కోసం పోటీపడడం వంటి దృశ్యాలు కనిపించాయి. శ్రీకాళహస్తి, కాణిపాకం, పడమటి మండలాల ప్లాట్‌ఫామ్స్ వద్ద బస్సులు కొరత నెలకొంది.

బంగారు తిరుచ్చిపై సుందరరాజస్వామి అభయం



తిరుచానూరు, సెప్టెంబరు 9(ఆంధ్ర జ్యోతి): తిరుచానూరులో కొలువై ఉన్న సుందరరాజస్వామికి మంగళవారం రాత్రి అత్యంత వేడుకగా తిరువీధి ఉత్సవం జరిగింది. స్వామివారి జన్మనక్షత్రం ఉత్తరభాద్రను పురస్కరించుకుని ఆలయంలో అర్చకులు విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. మూలమూర్తికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం చేశారు. ఇక రాత్రి సర్వఅలంకార శోభితులైన శ్రీదేవి, భూదేవి సమేత సుందరరాజస్వామిని బంగారు తిరుచ్చిపై కొలువుదీరి తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సూర్యప్రభపై శివపుత్రుడు



ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కాణిపాక ఆలయంలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఉత్సవాల్లో మంగళవారం రాత్రి వరసిద్ధి వినాయక స్వామి సూర్యప్రభ వాహనంపై దర్శనమిచ్చారు.ం ాజమ్మ,రాజశేఖర నాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఇంద్రసేన నాయుడు, లక్ష్మీపతినాయుడు ఉభయదారులుగా వ్యవహరించారు. ఉదయం స్వామివారికి ఉభయదారుల ఆధ్వర్యంలో అభిషేకం నిర్వహించాక భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రాత్రి ఉభయదారులు ఉభయ వరస తీసుకురావడంతో ఆలయ కల్యాణ వేదిక వద్ద ఉత్సవమూర్తులకు విశేష పూజలు నిర్వహించారు. సిద్ధి, బుద్ధి సమేత వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలను సూర్య ప్రభ వాహనంపై ఉంచి కాణిపాకం పురవీధుల్లో ఊరేగించారు.కాగా వినాయక స్వామికి మహానందీశ్వరాలయ అధికారులు పట్టువస్త్రాలను సమర్పించారు.

వీఆర్వోలపై పని ఒత్తిడి తగ్గించాలి

విజయవాడ (గాంధీనగర్), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా వీఆర్వోలు తీవ్ర పని ఒత్తిడి గురవుతున్నారని, వారి సమస్యలు పరిష్కరించాలని ఏపీ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బీహెచ్ రవీంద్రరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిరియాల లక్ష్మీనారాయణ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్, రెవెన్యూ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మిని రాష్ట్ర సచివాలయంలో మంగళవారం కలిసిన వారు వీఆర్వోల సమస్యలను ఆమెకు వివరించారు. కాగా, వెంటనే 15 రోజుల సర్వే ట్రైనింగ్ చేపట్టి, పరీక్షలు నిర్వహించాలని అధికారులకు ఆదేశాలిచ్చారని వారు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె

●ప్రైవేటు డిగ్రీ కాలేజీల సంఘాల ప్రకటన

అమరావతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కాలేజీలకు ఫీజుల బకాయిలు, ఇతర సమస్యలను పది రోజుల్లో పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతామని, నిరవధికంగా కాలేజీలను మూసివేస్తామని ప్రైవేటు డిగ్రీ కాలేజీ యాజయాన్యాల సంఘాలు ప్రకటించాయి. రెండు ప్రధాన సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.రమణాజీ, సి.వి జయభాస్కర్ రెడ్డి, పి.జయరాం, పి.పెద్దిరాజు మంగళవారం వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు. ఫీజుల బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రస్తుత అవసరాలకు తగ్గట్టుగా డిగ్రీ కోర్సులకు కొత్త ఫీజులు ఖరారు చేయాలని, డిగ్రీ కోర్సులకు ఫీజులు నిర్ణయించే అధికారం ఉన్నత విద్య కమిషన్ నుంచి యూనివర్సిటీల పరిధిలోకి మార్చాలని డిమాండ్ చేశారు. ఇంకా పలు డిమాండ్లు పేర్కొన్నారు.

అక్రమాల 'గుట్టు' తేలింది..ఇక వేటు ఖాయమే!

●కలెక్టర్ నుంచి డీసీవోకు అందిన డీసీసీబీ నివేదిక

●అక్రమార్కుల ఆస్తుల జప్తుకోసం డీఆర్వో సిఫార్సు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి):జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో పలువురు అధికారులు, సిబ్బందిపై త్వరలోనే క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశాలు కన్పిస్తున్నాయి.ఐదేళ్ల వైసీపీ పాలనలో డీసీసీబీలో ఆర్థిక విధ్వంసం, కోట్లాది రూపాయిల అవినీతి తదితర అంశాలను ఆంధ్రజ్యోతి వెలుగులోకి తెచ్చిన విషయం తెలిసిందే.పాలకవర్గం, అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించడం, రుణాల మంజూరులో వైసీపీ శ్రేణులకే పెద్దపీట వేయడం, కమీషన్లకు తెరతీయడం,ఉద్యోగ నియామకాల్లోనూ అవకతవకలకు పాల్పడడం తదితరాలపై ప్రభుత్వ ఆదేశాల మేరకు డీఆర్వో మోహన్‌కుమార్ విచారణ జరిపి కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే.విచారణలో ఈ అంశాలన్నీ నిజమేనని తేలినట్లు సమాచారం.ఈ నేపథ్యంలో ఆ రిపోర్టును కలెక్టర్ గతవారం డీసీవో లక్ష్మికి అందిస్తూ అక్రమార్కులపై తదుపరి చర్యలకు సిఫార్సుచేశారు. డీసీసీబీ చైర్మన్ అమాస రాజశేఖర రెడ్డి అధ్యక్షతన త్వరలో జరగనున్న సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. దోషులుగా తేలిన అప్పటి వైసీపీ నాయకులు, బ్యాంకు చైర్‌పర్సన్ రెడ్డెమ్మతో పాటు సెవెన్‌మెన్ కమిటీ సభ్యులందరి ఆస్తుల జప్తుకు చర్యలు తీసుకునే అవకాశముందని చెబుతున్నారు. మరోవైపు అప్పటి వైసీపీ నాయకుల అడుగులకు మడుగులొత్తి బ్యాంకు ఆస్తులను, నిధులను పప్పుబెల్లాల్లా అందించిన 20మందికి పైగా బ్యాంకు అధికారులు, సిబ్బందిపై ఇంక్రిమెంట్ కట్ వంటి క్రమశిక్షణా చర్యలు తీసుకోనున్నారు. వీరిలో కొందరిపై వేటు పడే అవకాశం కూడా ఉంది. ఐదేళ్ళు బ్యాంకు చైర్‌పర్సన్‌గా రెడ్డమ్మ వ్యున్నప్పటికీ వైసీపీ నేత అయిన ఆమె భర్త కృష్ణమూర్తి సమావేశాల్లో కూర్చోవడం, అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగేది.బ్యాంకు అధికారులతో కొందరు డైరెక్టర్లు కుమ్మక్కై రుణాలకు సంబంధించిన ప్రతి ఫైల్‌కు 10శాతం వసూలు చేసి మంజూరు చేసేవారు. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి అండదండలతో పాలకవర్గ సభ్యులు వారి బంధువుల పేర్లతో రికార్డుల్లో లేకుండా రూ.10 కోట్ల మేర రుణాలు తీసుకున్నారు. ఒక్క పైసా కూడా ఎవ్వరూ చెల్లించలేదు. 2022లో జరిగిన బ్యాంకు ఉద్యోగుల నియామకాల్లోనూ అక్రమాలు జరిగాయి. ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షల మేర వసూలు చేసినట్లు ప్రచారం జరిగింది. ఈ మొత్తాన్ని అధికారులు, పాలకవర్గం 50-25-25 శాతాల మధ్య పంచుకున్నారు. డబ్బులిచ్చి ఉద్యోగాలు పొందని సిబ్బంది పాలకవర్గ సభ్యుల చుట్టూ తిరిగినా పైసా కూడా వెనక్కి రాలేదు. టెర్మినేట్, సస్పెండ్ అయిన ఉద్యోగుల నుంచి కూడా భారీ మొత్తాలు తీసుకొని ఉద్యోగాలిచ్చినట్లు ఇటీవల జరిగిన విచారణలో తేలింది. అటెండర్, వాచ్‌మెన్ నియామకాల్లో గోల్‌మాల్, ఓటీఎస్, అమూల్ రుణాల పేరిట అక్రమార్జన అంశాలపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వార్తలపై విచారణ అధికారి సమగ్ర విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. త్వరలో జరిగే బ్యాంకు బోర్డు సమావేశంలో ఆస్తుల జప్తు, ఉద్యోగులపై క్రమశిక్షణా చర్యలు, ఇంక్రిమెంట్ కట్ వంటి పలు కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది.



డీసీసీబీ ప్రధాన కార్యాలయం

అనంతపురం సభకు ఎమ్మెల్యే బృందం



సభ ప్రాంగణంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసుల బృందం

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం సాయంత్రం జరగనున్న సూపర్‌సిక్స్-సూపర్‌హిట్ సభకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసుల బృందం మంగళవారం చేరుకుంది. మరో జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్‌తో పాటు ఆయన బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించారు. సభ విజయవంతానికి మంత్రులు అచ్చెన్నాయుడు, అనగాని సత్యప్రసాద్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌యాదవ్‌లతో కలసి చర్చించారు. తిరుపతి నగరాధ్యక్షుడు రాజారెడ్డి ఆ బృందంలో ఉన్నారు.

జేసీఐ సంబరాల్లో సామాజిక సేవ



మాట్లాడుతున్న శేషసాయి

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) సంబరాల్లో భాగంగా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షులు శేషసాయి తెలిపారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 9వ తేదీ నుంచి 15వ తేదీ వరకు జరిగే ఈ సంబరాల్లో భాగంగా ఒక్కోరోజు ఒక్కో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉచిత వైద్యశిబిరాలు, క్రీడాపోటీలు, వ్యాపారులతో అవగాహన సమావేశం నిర్వహిస్తామన్నారు. విద్యార్థులకు సామాజిక సేవా కార్యక్రమాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తిరుపతి పరిధిలో వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారిని గుర్తించి వారికి గోల్డ్‌మెడల్స్ పంపిణీ చేస్తామన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీఐ సంస్థ సభ్యులు శంకర్, ఉమామహేశ్వర్, గుణశేఖర్, రత్నశేఖర్, మునిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నృత్య కళోత్సవ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాయలసీమ రంగస్థలి స్వర్ణోత్సవ నృత్య కళోత్సవ వాల్‌పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. తిరుపతి గాంధీరోడ్డులోని భారతీయ మజ్దూర్ సంఘ్ కార్యాలయంలో ఈ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా బీఎంఎస్ జిల్లా అధ్యక్షులు, రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాధ్‌రెడ్డి మాట్లాడుతూ మహతి ఆడిటోరియంలోని శ్రీకృష్ణదేవరాయ కళాదర్బార్ వేదికపై రాయల సీమ రంస్థలి స్వర్ణోత్సవ కళోత్సవం ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కళోత్సవాల్లో రెండు తెలుగు రాష్ట్రాలకు నుంచి కళాకారులు పాల్గొంటారని చెప్పారు. ఈ ఉత్సవాన్ని నగర ప్రజలు జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రంగస్థలి కళాకారులు కేఎస్‌రాజా, సుబ్రహ్మణ్యం రెడ్డి, మురళీకృష్ణ, సురేష్‌స్వామి, కొట్టే సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు.

వ్యాయామంతో చక్కటి ఆరోగ్యం



5కే రన్ ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): శారీరక వ్యాయామంతో చక్కటి ఆరోగ్యం పొందవచ్చని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జూపార్కు రోడ్డులో నిర్వహించిన రెడ్ రన్ మారథాన్-5కే రన్‌ను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడక దివ్య ఔషధమని తెలిపారు. మారథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు, ఎన్ఎస్ఎస్, ఆర్ఆర్‌సీ వలంటీర్లతో కలిసి భారతీయ విద్యాభవన్ నుంచి టాటా క్యాన్సర్ ఆస్పత్రి వరకు రన్నింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ టీబీ అధికారి శైలజా, సిబ్బంది కోటిరెడ్డి, సురేంద, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణులపై దాడి దారుణం



నాయీబ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గ సభ్యులకు ధ్రువీకరణ పత్రాలు అందిస్తున్న సుధాకర్ తదితరులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లా వెంకటాచలం మండలం కసుమూరులో నాయీబ్రాహ్మణలపై దాడి దారుణమని నాయీ బ్రాహ్మణుల సేవా సంఘం రాష్ట్ర కన్వీనర్ శిబ్యాల సుధాకర్ పేర్కొన్నారు. తిరుపతి ప్రెస్ క్లబ్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ ఈ దాడికి పాల్పడిన వారిపై నాన్ బెయిలబుల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇటీవల ఎన్నుకున్న తిరుపతి నాయీబ్రాహ్మణ సేవా సంఘం నూతన కార్యవర్గ సభ్యులకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సంఘం అధ్యక్షులు సహదేవ జయకుమార్, ప్రధాన కార్యదర్శి గల్లా దాము, కోశాధికారి శివ తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులు నిత్య విద్యార్థులు

● పద్మావతి వర్సిటీ వీసీ ఉమ



అధ్యాపకులకు సర్టిఫికెట్లు ఇస్తున్న వీసీ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు నిత్య విద్యార్థులుగా ఉండాలని పద్మావతి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ పేర్కొన్నారు. ఆ వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ధృతి ఆడిటోరియంలో మూడు రోజుల పాటు అధ్యాపకులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందుకు సంబంధించిన సమాపనోత్సవం బుధవారం చేపపట్టారు. ఈ కార్యక్రమంలో వీసీ ఉమ మాట్లా డారు. మారుతున్న కాలానుగుణంగా అధ్యాపకులు బోధనలో మార్పు చేర్పులు చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. దీని వల్ల విద్యా ర్థులకు మంచి నైపుణ్యాలను అందించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. అనంతరం అధ్యాపకులందరికీ సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో విషయ నిపుణులు డాక్టర్ సంజీవ్‌కుమార్ (నిమ్హాన్స్, బెంగళూరు), ప్రోగ్రాం ఆర్గనైజర్స్ ప్రొఫెసర్ జాన్ సుష్మా (బయో టెక్నాలజీ), డాక్టర్ భార్గవి, పలు విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. నేడు (ఈ నెల 10న) ప్రపంచ ఆత్మహత్యల నిరోధక దినం సందర్భంగా స్థానిక జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఆత్మహత్యలపై అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలుంటే కుటుంబంలో చర్చించి పరిష్కరించుకోవాలన్నారు. అలాగే మానసిక వైద్యులను సంప్రదించి వారి సూచనలు పాటించాలని సూచించారు. అనంతరం ఆత్మహత్యలకు సంబంధించిన చట్టాలు, శిక్షల గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

హథీరాంజీ మఠం సమస్య పరిష్కరిస్తాం

● టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు దారా నాయక్



హథీరాంజీ మఠం భవనాలను పరిశీలిస్తున్న దారు నాయక్, పరిరక్షణ కమిటీ సభ్యులు

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): బంజారాల మనోభావాలకు అనుగుణంగా హథీరాంజీ మఠం సమస్య పరిష్కరిస్తామని టీడీపీ రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షులు దారా నాయక్ తెలిపారు. మఠం భవనాల స్థితిగతులను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. హథీరాంజీ మఠం స్థితిగతులను దేవదాయశాఖ అధికారుల నుంచి తెలుసుకుని పరిశీలించినట్లు చెప్పారు. ఇప్పటికే ఐఐటీ నిపుణులు ఈ భవనాన్ని పరిశీలించి నివేదికను సమర్పించారని చెప్పారు. ఆ మేరకు కలెక్టర్ పరిస్థితులకు అనుగుణంగా సమస్య పరిష్కారానికి కృషిచేస్తున్నారని చెప్పారు. ఈ సమయంలో కొంత మంది సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారాలను చేయడం తగదన్నారు. హథీరాం బాబాజీని అరాధ్య దైవంగా బావించే తమ బంజారా కులస్తుల బలహీనతలను అవకాశంగా మలుచుకుని మనోభావాలను దెబ్బతీయాలని కొంత మంది చేస్తున్న ప్రయత్నాలను మానుకోవాలని సూచించారు. ప్రభుత్వం తీసుకునే నిర్ణయం అందరికీ ఆమోదయోగ్యంగా ఉంటుందన్నారు. అన్యా క్రాంతమైన హథీరాంజీ మఠం భూముల పరిరక్షణకు కమిటీ ఏర్పాటు అవుతోందన్నారు. ఈ కార్యక్రమంలో మఠం పరిరక్షణ సమితి అధ్యక్షులు బి.అమృనాయక్, మనోహర్‌నాయక్, రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు ఎం.సుబ్బయ్య, రవినాయక్, సిద్ధనాయక్, ఏ.కళావతి పాల్గొన్నారు.

హక్కులపై అవగాహన పెంచుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజారెడ్డి

తిరుపతి(విద్య), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వినియోగదారులందరూ తమ హక్కుల గురించి తెలుసుకుని అవగాహన పెంచుకోవాలని జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు రాజారెడ్డి పిలుపునిచ్చారు. వినియోగదారుల సమాచారకేంద్రం ఆధ్వర్యంలో కన్స్యూమర్స్ క్లబ్ సమావేశం స్థానిక బాలాజీ కాలనీలోని ఎస్వీయూ క్యాంపస్ హైస్కూల్లో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిదశ నుంచే పిల్లలకు వినియోగదారుల హక్కుల గురించి తెలియజేయాలని సూచించారు. మోసపోతే వినియోగదారుల ఫోరంలో ఫిర్యాదు చేసి నష్టపరిహారం పొందాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల సంఘం ప్రతినిధి దాస మునిరెడ్డి, ప్రధానోపాధ్యాయులు షకీలా, క్లబ్ టీచర్ గైడ్లు సోమేశ్వరరావు, రాధమ్మ, అరుణ, నాగేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



వెంకటనాథన్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం విశిష్ట వేదాంత విభాగ పరిశోధకులు కె. వెంకటనాథన్ డాక్టరేట్ పొందారు. శ్రీనివాస పరికాలయతి విరచిత దురూహ శిక్షాయాః పాఠ సమీక్షాత్మకం సంపాదనం అధ్యయనం అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించారు. ఈ పరిశోధనకు ప్రొఫెసర్ చక్రవర్తి రాఘవన్ పర్యవేక్షకులుగా వ్యవహరించారు. ఈ మేరకు వర్సిటీ పరీక్షల అధికారి సాంబశివమూర్తి తెలిపారు.

గాంధీ భవన్‌ను అభివృద్ధి చేస్తాం

తిరుపతి, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): గాంధీ భవన్‌ను అభివృద్ధి చేస్తామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలియజేశారు. నగరంలోని గాంధీభవన్ పరిసరాలతో పాటు అలిపిరి ప్రాంతాల్లో పారిశుధ్య పనులను కమిషనర్ మౌర్య, గాంధీభవన్ ట్రస్ట్ చైర్మన్ రెడ్డివారి రాజశేఖర్‌రెడ్డితో కలసి మంగళవారం ఉదయం పరిశీలించారు. గాంధీభవన్‌లో బోరు మరమ్మతులు చేయించాలని, పారిశుధ్యం మెరుగ్గాచేయించాలని భవన్ సభ్యులు కోరారు. దీంతో కాలువల్లో చెత్తతొలగించాలని, బోరును బాగుచేయించాలని, మురుగునీరు వెళ్లే పైపులైన్ బాగుచేయాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. అలిపిరి పరిసర ప్రాంతాల్లో దుకాణాల వారు చెత్త చెదారం రోడ్ల పక్కన వేయకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని తెలిపారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ.మునికృష్ణ, కార్పొరేటర్లు పొన్నాల చంద్ర, రేవతి, ట్రస్ట్ సభ్యులు ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎంవీఎస్ మణి, అడ్వకేట్ అజయ్, ఎంఈ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్ వైజర్ చెంచయ్య తదితరులు ఉన్నారు.

బ్రహ్మోత్సవ ఏర్పాట్లు బాగుండాలి


తిరుపతి, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలకు నగరంలో ఏర్పాట్లు బాగాచేయాలని, పారిశుధ్య పనులు మెరుగ్గా చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో నగరంలో పారిశుధ్యం తదితర అంశాలపై మంగళవారం నగరపాలక సంస్థ, టీటీడీ అధికారులతో కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. మొబైల్ టాయిలెట్స్ ఎక్కువగా ఏర్పాటు చేయాలని తెలిపారు. ప్రధాన కూడళ్లలో విద్యుత్ దీపాలంకరణలు చేయాలని సూచించారు. ఫుట్‌పాత్‌లకు రంగులువేయాలని, డివైడర్ల మధ్యలో మొక్కలు నాటి అందంగా తీర్చిదిద్దాలన్నారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, టీటీడీ ఎస్ఈ చంద్రశేఖర్, ఎంఈ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, హార్టికల్చర్ ఆఫీసర్ హరికృష్ణ పాల్గొన్నారు.

'చవితి' సక్సెస్‌పై అభినందనలు



తిరుపతి, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): నగరంలో వినాయక చవితి వేడుకలు విజయవంతంగా నిర్వహించేందుకు కృషిచేసిన ప్రతి ఒక్కరికీ నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అభినందనలు తెలిపారు. చవితి వేడుకల విజయవంతానికి కృషి చేసిన అన్ని విభాగాల అధికారులు, నిమజ్జన కమిటీతో మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ భవిష్యత్తులో అందరూ కలసికట్టుగా విజయవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని పిలుపునిచ్చారు. నిమజ్జన కమిటీ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఒక కార్యాలయం కేటాయించాలని సామంచి శ్రీనివాస్ కోరారు. అనంతరం వినాయకుని చిత్రపటంతో కమిషనర్‌ను సన్మానించారు. ఈ సమావేశంలో డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, స్టేట్ అర్బన్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ ఊకా విజయ్‌కుమార్, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఏఎస్పీ రవి మనోహర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ , మున్సిపల్ ఇంజినీర్ గోమతి, డీసీపీ ఖాన్, డీఎస్పీ భక్తవత్సలం, రామకృష్ణ ఆచారి, తహసీల్దార్ సురేష్ బాబు, నిమజ్జన కమిటీ నాయకులు గుండాల గోపి అధికారులు పాల్గొన్నారు.





కుమారుల నుంచి రక్షణ కల్పించండి

● ఓ తండ్రి వేడుకోలు



తిరుపతి (కల్చరల్), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తన కుమారుల నుంచి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని ఓ తండ్రి పోలీసులను వేడుకున్నాడు. మంగళవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో తండ్రి చంద్రశేఖర్ మాట్లాడుతూ తాను టీటీడీలో పనిచేస్తున్నట్లు తెలిపారు. తన భార్య మీనాకుమారి, కుమారులు తేజసాయి, మహేష్‌లతో కాకుండా వేరుగా వినాయకనగర్ క్వార్టర్స్‌లో ఉంటున్నానని చెప్పారు. కొన్ని రోజులుగా తన ఆస్తి కోసం కుమారులిద్దరూ స్నేహితులతో కలిసి తనపై దాడులకు దిగి, తీవ్రంగా గాయపరిచారని విలపించారు.

నేడు పుస్తకావిష్కరణ

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుపతి ఎయిర్‌బైపాస్ రోడ్డులోని యూత్ హాస్టల్లో బుధవారం సాయంత్రం ముత్యాల సరాలు, కనకదుర్గా శతకం పుస్తకావిష్కరణ జరుగుతుందని నిర్వాహకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ మన్నవ భాస్కర నాయుడు జయంతి సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



కూరగాయల దాతలతో వాట్సాప్ గ్రూపు

టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సూచన.. బ్రహ్మోత్సవాల్లో రోజుకు పది టన్నులు అవసరం

తిరుమల, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): అన్నప్రసాదాలకు కూరగాయలు విరాళంగా టీటీడీకి అందజేస్తున్న దాతలతో ఒక వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి సూచించారు. కూరగాలయ దాతలతో బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలలోని అన్నమయ్య భవనంలో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఇటీవల అన్నప్రసాద విస్తరణ చేసిన నేపథ్యంలో దాతలు మరింత ముందుకు వచ్చి సహకరించాలని కోరారు. ప్రస్తుతం దాతలు రోజుకు 25 రకాల కూరగాయలు, 6 నుంచి 7 టన్నులు అందజేస్తున్నారని, బ్రహ్మోత్సవాల సమయంలో రోజుకు 10 టన్నులు అవసరముంటుందని అన్నప్రసాదం డిప్యూటీఈవో రాజేంద్రకుమార్, క్యాటరింగ్ ఆఫీసర్ శాస్త్రి వివరించారు. కూరగాయల విరాళాలు 2022లో 5.79 శాతం నుంచి 2025లో దాదాపు 7 శాతానికి పెరిగాయని తెలిపారు. తమిళనాడు, కర్ణాటక, ఏపీకి చెందిన కూరగాలయ దాతలను వెంకయ్య చౌదరి శ్రీవారిప్రసాదాలతో సత్కరించారు.



శ్రీవారి సర్వదర్శనానికి 12 గంటలు


తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 22 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.2.10 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 77,117

తలనీలాలు సమర్పించినవారు: 22,765





ఈ పక్కన ప్రస్తావించిన రెండూ ఉదాహరణలు మాత్రమే. మొబైల్ కొనివ్వలేదనో.. మార్కులు రాలేదనో.. ఆశించిన ర్యాంకు పొందలేదనో.. ప్రేమ విఫలమైందనో.. ఆర్థిక బాధలతో వేగలేకో.. కుటుంబ స్పర్థలతోనో.. కుంగుబాటుతోనో .. ఇలా రకరకాల కారణాలతో, క్షణికోద్రేకంతో కొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తమ మీద ఆశలు పెట్టుకున్న కుటుంబ సభ్యులను విషాదంలోకి నెట్టేస్తున్నారు. క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న ఇలాంటి వారిని గుర్తించి భుజం తట్టి..సాంత్వన కలిగిస్తే మరణాన్ని ఆశ్రయించరని చెబుతున్నారు మానసిక నిపుణులు. బుధవారం ఆత్యహత్యల నివారణ దినం సందర్భంగా ప్రత్యేక కథకం.

- తిరుపతి (నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

నేడు ఆత్మహత్యల నివారణదినం

- ఈ ఏడాది జూన్ 25న తొట్టంబేడులో పంట,వ్యక్తిగత రుణాల తీర్చలేక ఆందోళన చెంది రామయ్య(56) అనే రైతు ఉరి వేసుకుని మృతి చెందాడు.
- కోటలో కూలీ పనులు చేసుకునే చల్లప్పన్(28) రకరకాల కష్టాలు వెంటాడటంతో బతుకుపై విరక్తి పెంచుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.



ఆశ పెంచుకో.. ఆ ఆలోచన తుంచుకో

సిరివెన్నెల సీతారామశాస్త్రి ఓ పాటలో..నొప్పిలేని నిమిషమేది జననమైన మరణమైన జీవితాన అడుగు అడుగునా...నీరసించి నిలిచిపోతే నిమిషమైన నీదికాదు బతుకు అంటే నిత్య ఘర్షణ..అని జీవితం గురించి రెండు ముక్కల్లో చెబుతారు. కానీ కొందరు ఏ కష్టం కలిగినా తట్టుకోలేరు. పెద్ద ఉపద్రవం మీదపడినట్టు భావిస్తారు. తమకే కష్టాలొస్తున్నాయని డీలాపడిపోతారు. ఈక్రమంలోనే క్షణికావేశంతో ఆత్మహత్యకు పాల్పడుతుంటారని మానసిక శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. కాగా జిల్లా వ్యాప్తంగా ఈ ఏడాది ఆత్మహత్యల సంఖ్య కొంతమేర తగ్గడం శుభసంకేతంగా పోలీసులు పేర్కొంటున్నారు. గత ఏడాది దాదాపు 102 మంది బలవన్మరణాలకు పాల్పడగా గత నెల వరకు 79 మంది ప్రాణాలు తీసుకున్నట్లు జిల్లా క్రైం బ్యూరో గణాంకాలు చెబుతున్నాయి.

ఎందుకీ విపరీత ధోరణులు

అయిన దానినీ కానిదానినీ కొందరు విపరీత ధోరణి కోణంలో చూస్తుంటారు. తీవ్రమైన ఒత్తిడికి గురవుతుంటారు. నైరాశ్యాన్ని నింపుకొంటారు. ఇలాంటి పరిస్థితుల్లోనే క్షణికావేశంలో తనువు చాలించాలని నిర్ణయించుకుంటారు. వీరెవరూ కష్టాలను తట్టుకోడానికి సిద్ధపడరు. పరిష్కారంపై దృష్టి పెట్టరు. ప్రతిదానికీ పరిష్కారమో, ప్రత్యామ్నాయయో ఉంటుందని గుర్తించరు. ఈ అంతర్ముఖులు తమ సమస్య, ఆందోళన, మానసిక ఒత్తిడి గురించి ఎవరితోనూ పంచుకోరు. ముభావంగా, ఒంటరిగా ఉంటుంటారు. ఇలాంటి మానసిక రుగ్మతలతో బాధపడుతున్న వారిని కుటుంబసభ్యులో, బంధువులు లేదా స్నేహితులో గుర్తించాలి. కౌన్సెలింగ్ ఇచ్చేలా ధైర్యవచనాలు చెబితే పెనుముప్పు తగ్గుతుందని నిపుణులు చెబుతున్నారు. సానుకూల దృక్పథం వీరికి నూరిపోస్తే జీవితంపై ఆశపెంచుకుని మరణం ఆలోచన దరిచేరనివ్వరంటున్నారు.

ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి



పెరుగుతున్న న్యూక్లియర్ కుటుంబాలు, పిల్లలు దూరం కావడం, తగిన ఆర్థిక వనరులు లేకపోవడం, నిరంతర ఒత్తిడి, సాంఘిక వెసులుబాటు, పోటీ ప్రపంచంలో వెనుకబడటం, ఆరోగ్య సమస్యలతో ఎక్కువ మంది తీవ్రంగా మానసిక ఆందోళన చెందుతున్నారు. ఇలాంటి వారిలో. ఆందోళన, దిగులు, ముభావం, చిరాకు వంటి లక్షణాలు కనిపిస్తాయి. వీరిలో కొందరు ఆత్మహత్యకు పాల్పడుతుంటారు. ఈ లక్షణాలున్న వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఒంటరిగా ఉంచకుండా ఎవరోఒకరు తోడుగా వుండాలి. వారి భావాలను ఖండించకుండా సహానుభూతితో మెలగాలి. సమస్యలపై చర్చించకూడదు. వివాద రహిత విషయాలు మాట్లాడాలి. నలుగురిలో కలుపుకోవాలి. అవసరమైతే మానసిక వైద్యుడ్ని సంప్రదించాలి.

- డాక్టర్ కిషోర్, సీనియర్ సైకియాట్రిస్టు, తిరుపతి

సానుకూల దృక్పథమే ఊపిరి



జీవితంలో సమస్యలు సహజం. అవి శాశ్వతం కావని గుర్తించాలి. సహనం, ధైర్యం ప్రదర్శిస్తే పరిష్కారాలు కనిపిస్తాయి. ఆత్మహత్య అంటే పిరికితనం. సమస్య నుంచి పారిపోవడం. కానీ ఇది పరిష్కారం కాదు. ఎంత కష్టమైన ఇబ్బంది ఎదురైనా పోతుందనే నమ్మకం సంపూర్ణ బలాన్నిస్తుంది. ఏ పరిస్థితిలోనూ ఆశను వీడకూడదు. ఆశ ఉంటే శ్వాస వెంటే అంటారు. అదే మార్గం చూపుతుంది. ఆత్మవిశ్వాసం సన్నగిల్లుతోందనే భావన కలిగితే ఆత్మీయుల దగ్గరకు వెళ్ళాలి. కుటుంబ సభ్యులను ప్రేమించడం,క్షమాగుణం అలవర్చుకోవడం నేర్చుకోవాలి. తుది శ్వాస వరకు జీవితాన్ని ఆనందంగా గడపాలనే దృఢచిత్తం పెంచుకోవాలంటే సానుకూల వైఖరి పెంచుకోవాలి

- శ్రీలత, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ, తిరుపతి

అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం



టీటీడీ చైర్మన్‌కు చెక్కు అందజేస్తున్న దాత చిరంజీవి

తిరుమల, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు విరాళంగా అందింది. రాజమండ్రికి చెందిన చిరంజీవి విరాళం చెక్‌ను తిరుమలలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడికి మంగళవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు జ్యోతుల నెహ్రూ పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో మహిళా క్రికెటర్



నల్లపురెడ్డి చరణి

తిరుమల, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం భారత మహిళా క్రికెటర్ నల్లపురెడ్డి చరణి దర్శించుకున్నారు. ఈమెకు ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూ ప్రసాదాలు అందజేశారు. అలాగే, తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి కూడా స్వామి సేవలో పాల్గొన్నారు.

స్విమ్స్‌లో మూడు పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్విమ్స్ యూనివర్సిటీలోని పేథాలజీ విభాగంలో మూడు ప్రాజెక్టు పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని రిజిస్ట్రార్ అపర్ణబిట్లా ఒక ప్రకటనలో కోరారు. ప్రాజెక్టు అసోసియేట్, ప్రాజెక్టు అసిస్టెంటు పోస్టులతోపాటు వ డేటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు అభ్యర్థులు తమ దరఖాస్తులను ప్రిన్సిపాల్ ఇన్వెస్టిగేటర్ డీబీటీ నిదాన్ కేంద్ర, స్విమ్స్, తిరుపతికి పోస్టు ద్వారా పంపాలని ఆమె సూచించారు. ఈ నెల 27లోపు ఒరిజినల్ దరఖాస్తులతోపాటు సర్టిఫికెట్లను, ధ్రువీకరణ పత్రాలను సమర్పించాలన్నారు. పూర్తి వివరాలు, అప్లికేషన్ల కోసం స్విమ్స్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని వివరించారు.

కంపల్లె రవిచంద్రన్‌కు కీర్తి పురస్కారం



తిరుపతి (కల్చరల్), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : టీటీడీ సప్తగిరి మాసపత్రిక ప్రత్యేక శ్రేణి ఉపసంపాదకులు డాక్టర్ కంపల్లె రవిచంద్రన్ కీర్తి పురస్కారానికి ఎంపికయ్యారు. హైదరాబాదులోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయంలో ఈ నెల 23న జరిగే కార్యక్రమంలో ఈ పురస్కారాన్ని అందుకోనున్నారు. ప్రాచీన సాహిత్య విభాగంలో తొమ్మిది, ఆధునిక సాహిత్య విభాగంలో ఏడు గ్రంథాలు, సినిమా సాహిత్య విభాగంలో 13 పుస్తకాలు, అనువాద సాహిత్య విభాగంలో ఆరు గ్రంథాలతోపాటు సుమారు ఐదువేల వ్యాసాలను రవిచంద్రన్ రాశారు. ఇటీవల ఆంధ్రప్రదేశ్ కళారత్న పురస్కారం కూడా అందుకున్నారు.

పిల్లపాళెంలో ఇసుక అక్రమ రవాణా

- అడ్డుకున్న గ్రామస్తులు



పిల్లపాళెంలో ప్రైవేటు భూముల్లో 40 అడుగుల లోతుకు తవ్వడంతో నీటితో నిండిపోయిన గోతులు

రేణిగుంట సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): ఇసుక రవాణాను పిల్లపాళెంవాసులు అడ్డుకున్నారు. మండలంలోని పిల్లపాళెంలో ప్రైవేటు భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా ఇసుక యథేచ్ఛగా తవ్వి తరలిస్తున్నారు. దీనిపై గ్రామస్తులు మంగళవారం ట్రాక్టర్లను అడ్డుకుని పోలీసులకు సమాచారం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిత్యం పదుల సంఖ్యలో ట్రాక్టర్లు మితిమీరిన వేగంతో రాకపోకలు సాగిస్తుండడంతో ఆ దారిలో వెళ్తున్న తమ పిల్లలకు ప్రమాదం జరుగుతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గతంలో భూ యజమానికి హెచ్చరించామన్నారు. అయితే సదరు భూ యజమాని తిరుపతికి చెందిన వ్యక్తికి తన భూమిని లీజుకు ఇచ్చాడన్నారు. దీంతో నిత్యం ట్రాక్టర్లలో ఇసుక తరలిపోతోందన్నారు. సుమారు నలభై అడుగుల లోతు తవ్వేశారని, ఇటీవల కురిసిన వర్షాలకు ఆ గుంతల్లో నీరు చేరిందన్నారు. ఆ గుంతల్లో తమ పిల్లలు ఈతకు వెళితే ప్రమాదం జరిగే అవకాశం ఉందన్నారు. దీనిపై లీజుదారుడి దృష్టికి తీసుకెళ్లామని అయినా పట్టించుకోకపోవడంతో అడ్డుకున్నామని చెప్పారు. ఇసుక అక్రమ రవాణా చెయ్యకుండా కందకాలు తవ్వాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. సమాచారం అందుకున్న గాజులమండ్యం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకునే లోగా ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లు తరలిపోయాయి.

తీర పోలీస్ స్టేషన్ మరమ్మతులకు ప్రతిపాదనలు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సముద్ర తీరప్రాంతాల వద్ద భద్రతా ఏర్పాట్లను సమన్వయంతో చేపట్టాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా స్థాయి కోస్టల్ సెక్యూరిటీ సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ దుగరాజపట్నం కోస్టల్ పోలీస్‌స్టేషకు మరమ్మతులు, కాంపౌండ్ వాల్ నిర్మాణ అంశాలకు సంబంధించి అంచనాల ప్రతిపాదనలు పంపుతామన్నారు. మత్స్యకారులు వేటకు సమయంలో వెంట ఆధార్ కార్డు, బయోమెట్రిక్‌కార్డును తీసుకెళ్లేలా అవగాహన కల్పించాలని జిల్లా మత్స్యశాఖ అధికారిని ఆదేశించారు. తూపిలిపాళెం, దుగరాజపట్నం బీచ్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మెరైన్ పోలీసులకు సూచించారు. దీనికి అవసరమైన నిధులు సమకూరుస్తామన్నారు. మన రాష్ట్రానికి చెందిన బోట్లను గుర్తించడానికి నిబంధనల మేరకు కలర్ కోడింగ్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సముద్రంపై అక్రమ చేపల వేట జరగకుండా జిల్లా మత్స్యశాఖ, కోస్టల్ సెక్యూరిటీ అధికారులతో కలిసి జాయింట్ పెట్రోలింగ్ చేయాలన్నారు. తమిళనాడు నుంచి మత్స్యకారులు మెకనైజడ్ బోట్లతో అక్రమంగా మనవైపున్న సముద్ర జలాల్లో చేపలు పడుతున్నారని అధికారులు తెలపగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని కలెక్టరు చెప్పారు. ఈ సమావేశంలో స్పెషల్ బ్రాంచ్ డిప్యూటీ ఎస్పీ వెంకటరమణ డిప్యూటీ ఎస్పీ కోస్టల్ సెక్యూరిటీ పోలీసు బాలిరెడ్డి, అధికారులు విజయకుమార్, సురేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

తుడా ప్లాట్ల ఈ-వేలానికి విశేష స్పందన



ఈ-వేలం ప్రక్రియను పరిశీలిస్తున్న డాలర్ దివాకర్ రెడ్డి

తిరుపతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రేణిగుంట-తిరుపతి హైవే మార్గంలో పద్మావతినగర్‌లోని సూరప్పకసం తుడా లేఅవుట్‌లోని తుడా స్థలాలను ఈ- వేలం ద్వారా విక్రయిస్తున్నారు. ఈనెల 4న ప్రారంభమైన ఈ-వేలం 17వ తేదీతో ముగియనుంది. 277 ప్లాట్లకు గాను ఇప్పటివరకు 35 ప్లాట్ల విక్రయించారు. తద్వారా దాదాపు రూ.13 కోట్ల మేర ఆదాయం లభించినట్లు తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన వేలం ప్రక్రియను పరిశీలించారు. వేలం వివరాలను తుడా సెక్రటరీ డాక్టర్ ఎస్వీ శ్రీకాంత్‌బాబు వివరించారు. పేద మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉండేలా చదరపు గజం రూ.14వేలకు ధర నిర్ణయించామని దివాకర్‌రెడ్డి తెలిపారు. ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ సెమీ ఫైనల్స్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్ సెమీఫైనల్స్ పద్మావతి మహిళా యూనివర్సిటీలో బుధవారం నిర్వహించనున్నారు.ఉదయం 10 గంటలకు వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ ధృతి ఆడిటోరియంలో కార్యక్రమం ప్రారంభంకానుంది.సాంకేతికత-సామాజిక సమస్యల పరిష్కారం అంశంపై విన్నూత్న ఆలోచనలకు ఇది వేదిక కానుంది. తిరుపతి, నెల్లూరు, కడప జిల్లాలకు చెందిన 220మంది విద్యార్థులు,పలు సాంకేతిక సంస్థలు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఇందులో పాల్గొంటారు. పాల్గొన్న వారికి వివిధ థీమ్‌లపై పోటీలు నిర్వహిస్తారు. విజేతలకు నగదు బహుమతులు ప్రదానం చేస్తారు. దీంతో పాటు విజేతలనను ఫైనల్స్‌కు పంపనున్నారు.

పల్లంపేటలో దోపిడీ దొంగల అరెస్టు

- పోలీసుల అదుపులో కుదువ వ్యాపారి

ఏర్పేడు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు, శ్రీకాళహస్తి మండలాల్లో ఒంటరి మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడడమే కాకుండా వారి ఆభరణాలను దోచేకెళ్లే వారిని అరెస్టు చేయడమేకాకుండా వారికి సహకరించిన కుదువ వ్యాపారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఏర్పేడు సీఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాలు... వెంటకగిరికి చెందిన ప్రసాద్ తన కారులో సొంతపనుల నిమిత్తం తిరుపతికి గతనెల 30న బయలుదేరాడు. మార్గమధ్యంలోని పల్లంపేట వద్ద కారు మర్మతులకు గురైంది. దీంతో రోడ్డుపక్కన కారును మరమ్మతులు చేసుకుంటుండగా శ్రీకాళహస్తి మండలం ఇంద్రపల్లికి చెందిన ప్రసాద్, పాతగుంట దళితవాడకు చెందిన హరి కారు యజమాని ప్రసాద్‌ను పలకరించారు. మరమ్మతులకు సహకరించారు. రాత్రి 8 గంటలైనా కారు రిపేర్‌కాలేదు. ఈక్రమంలో ముగ్గురు కలిసి సమీపంలో బ్రాందీషాపులో మద్యం తాగారు. మద్యం మత్తులో ఉన్న ప్రసాద్ బంగారు నగలను, సెల్‌ఫోన్‌ను అపహరించుకుపోయారు. మత్తు నుంచి తేరుకున్న ప్రసాద్ తన వస్తువులు చోరీ అయినట్లు గుర్తించాడు. మూడు రోజుల పాటు ఇంద్రపల్లికి, పాతగుంట దళితవాడకు వెళ్లి నగలు, సెల్‌ఫోన్ ఇవ్వాలని కోరారు. వారు నగలను పల్లంపేటలో ఉన్న ఓ కుదువ వ్యాపారికి కుదువ పెట్టినట్లు చెప్పారు. దీనిపై ప్రసాద్ ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ శ్రీకాంత్‌రెడ్డి విచారణ చేపట్టారు. విచారణలో చోరీ జరిగినట్లు గుర్తించారు. చోరీ చేసిన ఇద్దరిని, కుదవు పెట్టుకున్న వ్యాపారిని మంగళవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

- నయా పంథా

గ్యాస్ కట్టర్‌తో తలుపు కోసి...!

వాంపల్లెలో చోరీకి పాల్పడ్డ దొంగలు



తలుపును గ్యాస్ కట్టర్‌తో కాల్చిన దుండగులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): శబ్దం రాకుండా సరికొత్త విధానంతో దొంగలు చెలరేగారు. గ్యాస్‌కట్టర్‌తో తలుపును కాల్చి ఇంట్లోని బంగారు ఆభరణాలను లూటీ చేశారు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం వాంపల్లెలో జరిగింది. నెల రోజుల వ్యవధిలో వాంపల్లిలో ఆరు వరుస చోరీలు వెలుగు చూశాయి. ఇంటికి తాళం వేసినట్లు కనిపిస్తే చాలు... రాత్రికి రాత్రే దొంగలు తెగబడుతున్నారు. ఒంటరి మహిళగా జీవనం సాగించే కరణం బుజ్జమ్మ సోమవారం రాత్రి సమీప గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లింది. ఉదయం ఇంటికి చేరుకోగానే ప్రధాన ద్వారాన్ని కాల్చి దొంగలు లోపలకు చొరబడినట్టు గుర్తించింది. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ గోపి క్లూస్ టీంతో ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. వరుస చోరీలు జరగడంపై లోతుగా ఆరా తీశారు. ప్రత్యేకించి మంగళవారం వెలుగు చూసిన చోరీలో శబ్దంరాకుండా గ్యాస్‌కట్టర్ ఉపయోగించడంతో పరిసరాల్లో పలు నమూనాలను సేకరించారు. మహిళ ఫిర్యాదు మేరకు 16 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీ జరిగినట్లు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.



చోరీపై విచారణ చేస్తున్న సీఐ గోపి

ఐదుగురు స్మగ్లర్ల అరెస్టు

- 9 ఎర్రచందనం దుంగల స్వాధీనం

మంగళం, సెప్టెంబరు9(ఆంధ్రజ్యోతి): టాస్క్‌ఫోర్సు పోలీసులు మంగళవారం ఐదుగురు స్మగ్లర్లను అరెస్టు చేశారు. టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆర్ఐ సాయిగిరిధర్‌కు చెందిన ఆర్ఎస్ఐ వినోద్‌కుమార్ బృందం రాజంపేట అటవీపరిధిలోని ఎస్ఆర్‌పాళెం ఫారెస్టు బీటులో మంగళవారం కూంబింగ్ నిర్వహించారు. ఈక్రమంలో రాళ్లమడుగు తుమ్మలబైలు జంక్షనుకు చేరుకోగా కొంతమంది ఎర్రచందనం దుంగలు మోసుకువెళుతూ టాస్క్‌ఫోర్సు పోలీసుల కంటబడ్డారు. వారిని వెంబడించి ఐదుగిరిని పట్టుకున్నారు. వారి నుంచి 9 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడ్డ వారు తమిళనాడుకు చెందినవారుగా గుర్తించారు. దుంగలతో సహా స్మగ్లర్లు తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీస్‌స్టేషన్‌కు తరలించి సీఐ సురేష్‌కుమార్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



పట్టుబడ్డ స్మగ్లర్ల అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు

మా గ్రామం వద్ద డంపింగ్ యార్డు వద్దు

కలెక్టరుకు కొణ్ణంబట్టు గ్రామస్తుల వినతి

సూళ్లూరుపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామం సమీపంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయద్దని కోరుతూ కొణ్ణంబట్టు గ్రామస్తులు మంగళారం కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవలే సూళ్లూరుపేట మున్సిపాలిటీ డంపింగ్ యార్డు కోసం కొణ్ణంబట్టు గ్రామ సర్వే నెంబరు 131లో 10 ఎకరాల భూమిని కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపాలిటీ అధికారులు పట్టణంలో ఉత్పత్తి అయ్యే చెత్త, వ్యర్థాలను డంపింగ్ యార్డు వద్దకు ట్రాక్టర్లలో తీసుకెళ్లగా సమీపంలోని కొణ్ణంబట్టు, పెరిమిటిపాడు, లక్ష్మీపురం గ్రామస్తుల అడ్డుకుని ఆందోళన చేశారు. ఈ నేపథ్యంలో మూడు గ్రామాల చెందిన ప్రజలు కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

టీడీపీ సీనియర్ నేత వేణుగోపాల్ మృతి



వేణుగోపాల్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్

తడ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత, మాజీ సర్పంచ్ బోడిలింగాలపాడు వేణుగోపాల్(65) అనారోగ్యంతో సోమవారం రాత్రి మృతి చెందారు. టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో కొనసాగిన వేణుగోపాల్ తడ మండల అధ్యక్షుడిగా సుదీర్ఘకాలం కొనసాగారు. తడ కండ్రిగ పంచాయతీ సర్పంచ్‌గా రెండు పర్యాయాలు ఎన్నికయ్యారు. వేణుగోపాల్ మరణవార్త తెలుసుకున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, టీడీపీ నేత, ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్, బెస్త కార్పొరేషన్ చైర్మన్ బొమ్మన శ్రీధర్, టీడీపీ నాయకులు మురళీరెడ్డి, సెల్వం, పళణి, ఏకాంబరం, రవి, వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జయకుమార్‌రెడ్డి, వైసీపీ నాయకుడు ఆర్ముగం, తిరుమలరెడ్డి, ఉచ్చూరు మునస్వామిరెడ్డి, సీపీఐ నాయకులు సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బాలగురవం తదితరులు వేణుగోపాల్ ఇంటికి చేరుకొని ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన

దొరవారిసత్రం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రంలోని బీసీ గురుకుల పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల విద్యార్థులకు భూసార పరీక్షలపై వ్యవసాయాధికారులు మంగళవారం అవగాహన కల్పించారు. జిల్లా భూసార పరీక్షా కేంద్రం ఇన్‌చార్జి ఏడీఏ శ్రీనివాస చక్రవర్తి విద్యార్థులకు మట్టి పరీక్ష ప్రాముఖ్యతను వివరించారు. పంటల సాగులో భూసార పరీక్షలు తప్పనిసరి అని, రైతులు అవగాహన లేక రసాయనిక ఎరువులను ఎక్కువ మోతాదులో వాడేస్తున్నారని తెలిపారు. మట్టి నమూనాలను సేకరించడం, పరీక్షలు చేయించుకోవడం, నాణ్యత, లోపాలను గుర్తించి, దానికి అనుగుణంగా ఎరువులు వాడకం, పంటలు పెంపకం చేపట్టాని వివరించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు భూసార పరీక్షల ప్రాముఖ్యతను తెలియజేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా భూసార పరీక్షా కేంద్రం ఏవోలు కల్యాణబాబు, పుష్పాంజలి, డీఆర్‌సీ ఏవో శ్రీనివాసులు, రాజీవన, స్థానిక ఏవో జ్యోతిర్మయి పాల్గొన్నారు.

క్షేత్ర సహాయకుడి పనితీరుపై విచారణ

కోట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిమ్మానాయుడు పాళెంలో మంగళవారం ఉపాధి క్షేత్రసహాయకుడి పనితీరుపై విచారణ జరిగింది. క్షేత్రసహాయకుడి పనితీరు బాగాలేదని, అతనిని తొలగించి కొత్త వారికి అవకాశం ఇవ్వాలంటూ తిమ్మానాయుడుపాళెం గ్రామానికి చెందిన కొంతమంది ఉపాధి పీడీ శ్రీనివాస ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు ఉపాధి ఏపీడీ వరప్రసాద్, ఎంపీడీవో దిలీప్‌కుమార్‌నాయక్ విచారణ చేపట్టారు. ప్రస్తుతం కొనసాగుతున్న క్షేత్ర సహాయకుడి పనితీరు బాగుందని, అతనినే కొనసాగించాలని స్థానికులు చెప్పారు.

టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలని సమగ్రశిక్ష ఏపీసీ గౌరీశంకర్ అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. విద్యార్థులపై ప్రత్యేక దృష్టి తీసుకొని పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మంచి భోజనం అందించి వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలన్నారు. అలాగే దివ్యాంగ పిల్లలకు నిర్వహించిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈవో మునిరత్నం, ప్రధానోపాధ్యాయురాలు మంజుల తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలింపుపై ఘర్షణ

పెళ్లకూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరసనంబేడు గ్రామంలో గ్రావెల్ తరలింపు విషయంలో గ్రామస్తులకు, గ్రావెల్ రవాణా చేస్తున్న వారి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. గ్రామ సమీపంలోని ప్రభుత్వ భూముల్లో నుంచి టిప్పర్లలో గ్రావెల్ తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. అనుమతి లేకుండా గ్రావెల్ తరలిస్తే ఊరుకోబోమని గ్రామస్తులు స్పష్టం చేశారు. దీంతో రెండు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకని ఒకరిపై ఒకరు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నారు.

నష్టపరిహారం అందించాలని నిరసన



సాగరమాల రోడ్డు పనుల వద్ద రైతులు నిరసన

చిల్లకూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలం లోని తొణుకుమాల సమీపంలో సాగరమాల రోడ్డు నిర్మాణానికి భూమిచ్చిన రైతులు నష్టపరిహారం చెల్లిం చాలంటూ మంగళవారం నిరసన తెలిపారు. సాగర మాల రోడ్డు నిర్మాణానికి తాము భూములిస్తే, ఇప్పటి వరకు నష్టపరిహారం చెల్లించ లేదన్నారు. ఈ విషయాన్ని పలుమార్లు అధికారుల దృష్టి తీసుకువెళ్లినా పట్టించుకోవడంలేదన్నారు.

మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జలీల్ అహ్మద్, టీడీపీ నాయకులు

కోట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు షేక్ జలీల్ అహ్మద్ పుట్టినరోజు వేడుకలు మంగళవారం మారంరెడ్డి శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగాయి. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి తిరుమల శెట్టి కోటేశ్వరరావు, వెంకన్నపాళెం సర్పంచ్ మధుయాదవ్ ఆధ్వర్యంలో కోట ప్రభుత్వాస్పత్రిలో రోగు లకు పండ్లు, రొట్టెలు అందజేశారు. రవినగర్‌లో 500 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు.

పీఎండీఎస్ కిట్ల పంపిణీ

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వర్దనపల్లి, టీపీకండ్రిగ, విశ్వనాధపురం, పంజాం, పాళెంకోట, నీకంఠాపురం, మొగళ్లగుంట, గ్రామాల్లోని ఎస్టీ రైతులకు సబ్సిడీ కింద పీఎండీఎస్(ప్రీ మాన్‌సూన్ డ్రై షోయింగ్) కిట్లను ఏడీ అనసూయ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు ఆర్జించవచ్చున్నారు. కార్యక్రమంలో ఏవో సుజాత, ప్రవీణా, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కాశీపేట సెంటర్ వద్ద కళాకారుల కోలాటం

మొదలైన జాతర సందడి



పోలేరమ్మ ఆలయం వద్ద విద్యుత్ దీపాలకరణ

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలో గ్రామశక్తి పోలేరమ్మ జాతర సందడి మొదలైంది. బుధ, గురువారాల్లో జాతర నిర్వహించేందుకు దేవదాయశాఖ, మున్సిపాలిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తయ్యాయి. ప్రతి ఒక్కరికీ అమ్మవారి దర్శనం కలిగేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆదివారం ఘటోత్సవంతో జాతర మొదలైన విష యం తెలిసిందే. అప్పటి నుంచే వివిధ ప్రాంతా నుంచి వచ్చిన కళాకారులు తమ ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు. పోలేరమ్మ ఆలయం వద్ద విద్యుత్ దీపాలంకరణతో ఆకట్టుకుంటోంది. పట్టణంలోని పలు కూడళ్లలో కటౌట్లు ఏర్పాటు చేశారు. పట్టణంలో అమ్మవారి ఊరేగింపు జరిగే రాజవీధిలో చెట్ల కొమ్మలను తొలగించారు. జాతర సందర్భంగా పట్టణంలో సంచార దుకాణాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే రంగులరాట్నం, ఎగ్జిబిషన్లు ఏర్పాటు చేశారు. మంగళవారం రాత్రి జాతర ఏర్పాట్లను గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, డీఎస్పీ గీతాకుమారి పరిశీలించారు.

సూపర్ సిక్స్ - సూపర్ హిట్ సభను విజయవంతం చేయండి

గూడూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అనంతపురంలో బుధవారం నిర్వహించే సూపర్ సిక్స్ - సూపర్‌హిట్ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం అనంతపురంలోని ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో బహిరంగ సభ సన్నాహక చర్యలపై మంత్రుల ఆధ్వర్యంలో నిర్వహించిన సమీక్షలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎన్నికల హామీలను నెరవేర్చడంతో సూపర్ సిక్స్ - సూపర్ హిట్ పేరుతో నిర్వహిస్తున్న బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నిధులు దుర్వినియోగంపై చర్యలు తీసుకోండి

పెళ్లకూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిరసనంబేడు పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై విచారణ చేసి చర్యలు చేపట్టాలని టీడీపీ నాయకులు మల్లు ప్రసాద్, కృష్ణయ్య డిమాండ్ చేశారు. మంగళవారం పెళ్లకూరులో వారు మీడియాతో మాట్లాడారు. పంచాయతీ అభివృద్ధి కోసం కేటాయించిన 15వ ఆర్థిక సంఘం నిధుల దుర్వినియోగంపై కలెక్టర్, డీపీవో, ఎంపీడీవోలకు వినతిపత్రం అందించి చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. విచారణ పూర్తయ్యేంత వరకు నిధులు వినియోగాన్ని నిలిపి వేయాలన్నారు. కార్యక్రమంలో శిరసనంబేటి సుందరరామిరెడ్డి, రమేష్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, సురేష్, చంద్రయ్య, శ్రీనివాసులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై విద్యార్థులకు అవగాహన

దొరవారిసత్రం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): దొరవారిసత్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు మంగళవారం నవజీవన్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. నవజీవన్ ఆర్గనైజేషన్, సీసీపీయూ ప్రాజెక్టు ఆధ్వర్యంలో హెచ్ఐవీ నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మరు

గూడూరు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు చెబుతున్న కల్లబొల్లి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చిందన్నారు. దీనిని చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. సరిగ్గా రెండేళ్ల క్రితం ఇదే వైసీపీ నాయకులు ప్రభుత్వ అవినీతిని ప్రశ్నిస్తూ నిరసన తెలిపేందుకు వెళ్తున్న తమను అక్రమంగా అరెస్ట్ చేయించిందన్నారు.

ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించండి



గుడూరులో వైసీపీ నాయకుల ర్యాలీ - సూళ్లూరుపేట ఆర్డీవో కార్యాలయం వద్ద మాజీ ఎమ్మెల్యే కిలివేటి ఆధ్వర్యంలో వైసీపీ నాయకుల నిరసన

గూడూరు అర్బన్, సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): యూరియా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, కూటమి ప్రభుత్వం బ్లాక్ మార్కెట్‌ను నియంత్రించి ఎరువులను అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, వెంకటగిరి వైసీపీ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం గూడూరులోని టవర్ క్లాక్ సెంటర్ నుంచి పార్టీ శ్రేణులతో కలిసి ప్రదర్శనగా వెళ్లి సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, కల్పలత, విజయ్ కుమార్‌రెడ్డి, బొమ్మిడి శ్రీనివాసులు, భక్తవత్సలరెడ్డి, సంపత్‌రెడ్డి, సుబ్బారావు, సునీల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో సూళ్లూరుపేటలోని వినాయకుడి గుడి సెంటర్ నుంచి ఆర్డీవో కార్యాలయానికి వైసీపీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరారు. హోలిక్రాస్ కూడలి వద్ద పోలీసులు ర్యాలీకి అనుమతి లేదంటూ అడ్డుకున్నారు. దీంతో వైసీపీ నాయకులు వేర్వేరుగా ఆర్డీవో కార్యాలయం వద్దకు చేరుకుని నిరసన తెలిపారు. ఏవో రవికుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి, నాయుడుపేట మున్సిపాలిటీ చైర్ పర్సన్ దీపిక, సూళ్లూరుపేట మున్సిపాలిటీ వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఆరిమేనిపాడు ఎంపీటీసీ మృతి



రఘురామరాజు (ఫైల్‌ఫొటో)

ఓజిలి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం ఆరిమేనిపాడు గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యుడు గుంటమడుగు రఘురామరాజు(65) గుండెపోటుతో మృతి చెందారు. గూడూరులోని కుమారుడి ఇంట్లో ఉంటున్న ఆయనకు మంగళవారం తెల్లవారుజామున గుండెపోటు రావడంతో కన్నుమూశారు. భౌతికకాయాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు పూర్తి చేశారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, వెంకటగిని వైసీపీ ఇన్‌చార్జి నేదురుమల్లి రాంకుమార్‌రెడ్డి, ఓజిలి మండల వైసీపీ కన్వీనరు పాదర్తి హరినాద్‌రెడ్డి తదితరులు ఆరిమేనిపాడుకు గ్రామానికి వెళ్లి రఘురామరాజు భౌతికకాయానికి నివాళులర్పించారు.

ఘన వ్యర్థాల నిర్వహణపై సీఆర్పీలకు శిక్షణ

బాలాయపల్లి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లిలోని చెత్తతో సంపద తయారీ కేంద్రం వద్ద మంగళవారం డివిజన్‌లోని సీఆర్పీలకు ఘన వ్యర్థాల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎల్‌డీవో వాణిరెడ్డి మాట్లాడుతూ సీఆర్పీలు వారి పరిధిలోని కుటుంబాలకు తడి, పొడి చెత్తను వేర్వేరుగా గ్రీన్ అంబాసిడర్‌లకు అందించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దట్టం అంజలి, టీడీపీ మండల అధ్యక్షుడు రాయి మస్తాన్ నాయుడు, ఎంపీడీవో వినీల్ కుమార్, జిల్లా కోఆర్డినేటర్ షణ్ముగం, గూడూరు డివిజన్ కోఆర్డినేటర్ రవి, పంచాయతీ కార్యదర్శి మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన

కోట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంలోని యానాదుల బాలికల పాఠశాలలో మంగళవారం బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం జరిగింది. సీడీపీవో మునికుమారి బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. విద్యార్థినులు కౌమార దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బేటీ బచావో - బేటీ పడావో సంకల్ప పథకం గురించి అవగాహన కల్పించారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

గూడూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో బాలకృష్ణంరాజు సహకారంతో స్థానిక ఏరియా ఆస్పత్రిలో గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. డాక్టర్ షరీనా, బాలకృష్ణంరాజు, నాగరాజు, చెంచు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌బీకేఆర్‌లో ఆర్మీ జవాన్లకు శిక్షణ



కోట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి లోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళ వారం ఆర్మీ జవాన్లకు వారం రోజుల శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి తరగతులను ప్రారంభించారు. ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ అరుణ్‌కుమార్ ఎన్‌సీసీ క్యాడెట్లకు డ్రిల్, ఫైరింగ్, దేశభక్తి పెంపొందించే అంశాలపై జవాన్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి మాధవయ్య పాల్గొన్నారు.

సేవా పక్షోత్సవాలపై సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కర్నాటి ఆంజనేయరెడ్డి

నాయుడుపేట, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్రమోదీ జన్మదినం సందర్భంగా ఈనెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ గాంధీ జయింతి వరకు బీజేపీ ఆధ్వర్యంలో సేవా పక్షోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ సీనియర్ నేత కర్నాటి ఆంజనేయరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నాయుడుపేట పట్టణంలోని ఓ కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు సేవా పక్షోత్సవాల నిర్వాహణపై సమీక్ష నిర్వహించారు. సూళ్లూరుపేట, గూడూరు నియోజకవర్గాల ఇన్‌చార్జిగా ఎద్దల నరేంద్రరెడ్డి మాట్లాడుతూ సేవా పక్షోత్సవాల్లో రక్తదాన శిబిరాలు, మొక్కలు నాటడం, స్వచ్ఛ దివాస్ తదితర కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు.

సంఘాల బలోపేతంపై అవగాహన



వీవోఏ నుంచి వివరాలు సేకరిస్తున్న ఏపీఎం అనీల

కోట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కోట వెలుగు కార్యాలయంలో మంగళవారం పొదుపు సంఘాల బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వెలుగు ఏపీఎం అనీల మాట్లాడుతూ ప్రతి సంఘానికి బ్యాంక్ లీకేజీ ద్వారా రుణాలు ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. పెరటి కోళ్లు, కొరమేను చేపల పెంపకంపై సంఘాల సభ్యులకు అవగాహన కల్పించి బ్యాంక్ లీంకేజీ ద్వారా రుణాలు ఇచ్చి వారి జీవనోపాధులకు బాటలు వేయాలన్నారు. అదేవిధంగా స్త్రీనిధి లక్ష్యాలపై సమీక్షించారు. సమావేశంలో సీసీలు భాస్కర్, ప్రసాద్, శ్రీకాంత్, శంకర్, అలివేలమ్మ, బిందు తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకులు నిత్య విద్యార్థులు

పద్మావతి వర్సిటీ వీసీ ఉమ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు9 (ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు నిత్య విద్యార్థులుగా ఉండాలని పద్మావతి యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమ పేర్కొన్నారు. ఆ వర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ ధృతి ఆడిటోరియంలో మూడు రోజుల పాటు అధ్యాపకులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందుకు సంబంధించిన సమాపనోత్సవం బుధవారం చేపపట్టారు. ఈ కార్యక్రమంలో వీసీ ఉమ మాట్లాడారు. మారుతున్న కాలానుగుణంగా అధ్యాపకులు బోధనలో మార్పు చేర్పులు చేసుకోవలసిన అవసరం ఉందన్నారు. దీని వల్ల విద్యా ర్థులకు మంచి నైపుణ్యాలను అందించడానికి అవకాశం ఏర్పడుతుందన్నారు. అనంతరం అధ్యాపకులందరికీ సర్టిఫికెట్లను అందజేసి అభినందించారు. కార్యక్రమంలో విషయ నిపుణులు డాక్టర్ సంజీవ్ కుమార్(నిమ్హాన్స్, బెంగళూరు), ప్రోగ్రాం ఆర్గనైజర్స్ ప్రొఫెసర్ జాన్ సుష్మా (బయో టెక్నాలజీ), డాక్టర్ భార్గవి, పలు విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

శారీరక వ్యాయామంతో చక్కటి ఆరోగ్యం

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): శారీరక వ్యాయామంతో చక్కటి ఆరోగ్యం పొందవచ్చని డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అండ్ టీబీ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక జూపార్కు రోడ్డులో నిర్వహించిన రెడ్ రన్ మారథాన్-5కే రన్‌ను జెండా ఊపి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నడక దివ్య ఔషధమని తెలిపారు. మారథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు, ఎన్ఎస్ఎస్, ఆర్ఆర్‌సీ వలంటీర్లతో కలిసి భారతీయ విద్యాభవన్ నుంచి టాటా క్యాన్సర్ ఆస్పత్రి వరకు రన్నింగ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి శైలజా, సిబ్బంది కోటిరెడ్డి, సురేంద, పుల్లయ్య పాల్గొన్నారు.

సమస్యలకు ఆత్మహత్యలు పరిష్కారం కాదు

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ అన్నారు. నేడు(ఈ నెల 10న) ప్రపంచ ఆత్మహత్యల నిరోధక దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన ఆత్మహత్యలపై అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలుంటే కుటుంబంలో చర్చించి పరిష్కరించుకోవాలన్నారు. అలాగే మానసిక వైద్యులను సంప్రదించి వారి సూచనలు పాటించాలని సూచించారు. అనంతరం ఆత్మహత్యలకు సంబంధించిన చట్టాలు, శిక్షల గురించి ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

గేట్ వసూల్... వసతులు నిల్!



వడమాలపేట, సెప్టెంబరు 9(ఆంధ్ర జ్యోతి): ఎండలో ఎండుతూ, వానల్లో తడుస్తూ వారపు సంతలో చిన్నపాటి దుకాణదారులు అల్లాడుతున్నారు. తాజా కూరగాయలు తక్కువ ధరలకే దొరుకతుండడంతో వడమాలపేట సంతకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పలువురు కొనుగోలుదారులు వస్తుంటారు. అయితే వసతి, సౌకర్యం లేకనే పొట్టకూటికోసం ఎక్కడెక్కడ నుంచో వచ్చి ప్రతి గురువారం వారాపుసంత నిర్వహించే దుకాణదారుల నుంచి కొందరు గేట్ వసూళ్లకు పాల్పడడంపై దుకాణదారులు మనస్తాపానికి గురువుతున్నారు. వడమాలపేటలో వారపు సంత నిర్వహించే ప్రదేశం ఎస్వీపురం పంచాయతీ పరిధిలోకి వస్తుంది. గేట్ వసూళ్లపై ప్రతి గురువారం చిన్నపాటి ఘర్షణలు జరుగుతున్నాయి. గేట్ వసూళ్ల చేయకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పేద కుటుంబాలకు ఆరోగ్య భరోసా



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ పండ్ నిరుపేద కుటుంబాలకు ఆరోగ్య భరోసా కల్పిస్తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. కేఎంఅగ్రహారంలో అనారోగ్యంతో బాధపడుతున్న చిరంజీవికి రూ.4,83,226 చెక్కును అందజేశారు. పుత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్ డి.ఎస్.గణేష్, వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ షణ్ముగరెడ్డి, టీడీపీ బీసీ సెల్ కార్యదర్శి మహేష్, నాయకులు భాస్కర్, అశోక్, భాగ్యరాజు, ధనశేఖర్, కార్తీక్, ధనలక్ష్మీ, గీత, శాంతి తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

పుత్తూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి):విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారానికి డివిజన్ కార్యాలయంలో ఈనెల 10న బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నామని పుత్తూరు విద్యుత్ డీఈ దేవ ఆశీర్వాదం తెలిపారు. ఈ అదాలత్ విశ్రాంత జడ్జి శ్రీనివాస ఆంజనేయమూర్తి, ఆర్థిక, సాంకేతిక సభ్యుడు మధుకుమార్, స్వతంత్ర సభ్యురాలు విజయలక్ష్మి ఆధ్వర్యంలో జరుగుతుందన్నారు. పుత్తూరు, నాగలాపురం సబ్ డివిజన్లలోని ఎనిమిది మండలాలతో పాటు శ్రీసిటీ వినియోగదారుల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. సమస్యలను లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయాలన్నారు.

వైభవంగా గంగమ్మ గెరిగ ఊరేగింపు



పుత్తూరు టౌన్, సెప్టంబర్ 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని గేటు పుత్తూరులో గంగ జాతర సందర్భంగా గంగమ్మ గెరిగ ఊరేగింపు నిర్వహించారు. సోమవారం రాత్రి గేటు పుత్తూరులో గంగ జాతర చాటింపు చేశారు. మంగళవారం ఉదయం గంగమ్మ ఆలయం వద్ద విశేష పూజలు నిర్వహించి, గెరిగను ఊరేగించారు. గంగమ్మ జాతర నిర్వాహకులు ఉన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే విద్యా వికాసం



విద్యాసామగ్రి పంపిణీలో విజయబాబు

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలోనే మెరుగైన విద్యా వికాసం సాధ్యమవు తోందని టీడీపీ రాష్ట్ర కార్యని ర్వాహక కార్యదర్శి పోతు గుంట విజయ్‌బాబు పేర్కొ న్నారు. మంగళవారం నెత్తం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యా సామగ్రిని అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం చిన్నయ్య శెట్టి, టీడీపీ నాయకులు విజయ్‌శేఖర్ నాయుడు, చంద్రాయాదవ్, మధుసూదన్‌రాజు, కుమార్‌రెడ్డి, గోవర్ధన్ యాదవ్, బండి రమేష్, మణికంఠ, పోతుగుంట రమేష్ పాల్గొన్నారు.

పూడి సచివాలయంలో చోరీ

వడమాలపేట, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పూడి సచివాలయంలో ఆదివారం రాత్రి దొంగలు పడ్డారు. కార్యాలయం తాళాలు పగలగొట్టి మూడు ప్రింటర్లు, రెండు ల్యాప్‌టాప్‌లను చోరీ చేశారు. సోమవారం కార్యాలయానికి వచ్చిన సిబ్బంది తలుపులు తెరిచిఉండడాన్ని గమనించి పోలిసులకు ఫిర్యాదు చెశారు. సిబ్బంది ఫిర్యాదు మేరకు ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఎస్ఐ ధర్మారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కలకలం రేపిన బాలుడు తప్పిపోయిన ఘటన

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): బాలుడు తప్పిపోయిన ఘటన కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాలు... అంబేద్కర్ కూడలి సమీపంలోని అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న బాలుడు ప్రభుత్వ ఆస్పత్రి వద్దకు చేరుకున్నాడు. గమనించిన స్థానికులు బాలుడిని సముదాయించి వివరాలు ఆరా తీశారు. ఎంతకీ చెప్పకపోవడంతో పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ సమాచారం వాట్సప్‌లలో హల్‌చల్ చేసింది. దీంతో కృష్ణానగర్‌కు చెందిన తల్లిదండ్రులు తులసి, శ్రీనివాసులు పోలీస్‌స్టేషన్‌కు చేరకుని తమ కుమారుడిని తీసుకెళ్లారు.

భక్తవత్సలం రాజు సేవలు అభినందనీయం



పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): పోలీస్ శాఖలో 35 సంవత్సరాల పాటు విధులు నిర్వహించి ఏఎస్ఐగా రిటైరవుతున్న భక్తవత్సలం రాజు సేవలు అభినందనీయమని సీఐ శేఖర్ రెడ్డి కొనియాడారు. మంగళవారం స్థానికంగా భక్తవత్సలం రాజు పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు. విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేసి అందరి మన్ననలు పొందిన వ్యక్తి అని ప్రశంసించారు. శేష జీవితాన్ని ఆనందంగా గడపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ ఓబయ్య, ఎంపీఐ చంద్రశేఖర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రైతులను మోసగించింది గత వైసీపీ ప్రభుత్వమే

పంటల బీమా పేరుతో మాజీ సీఎం మోసం ● ఎమ్మెల్యే సుధీర్ ధ్వజం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో రైతులకు నరకాన్ని చూపించారని, యూరియా కోసం రాత్రిళ్లు క్యూ లైన్లలో నిలబడ్డారని ఎమ్మెల్యే సుధీర్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. ఉచిత పంటల బీమా పేరుతో రైతులను మాజీ సీఎం జగన్ మోసం చేశాడన్నారు. ఉద్యానపంటలకు మద్దతు ధర ప్రకటించినా కిలో కూడా కొనలేదని మండిపడ్డారు. వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య రంగాలను సర్వనాశనం చేసి నేడు కూటమి ప్రభుత్వంపై అబద్ధపు ప్రచారాలు చేస్తూ పబ్బం గడుపుకుంటున్నాడని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం రైతుకు అండగా నిలుస్తోందన్నారు. రైతులు ఇబ్బంది పడకుండా యూరియా, విత్తనాలు, బీమా, మద్దతు ధరలతో సాయం అందిస్తోందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో యూరియా కొరతతో రైతులు ఇబ్బంది పడ్డారన్నారు. ఈ ఏడాది 81వేల హెక్టార్లలో అధికంగా పంటలు వేయడం, యూరియా వినియోగాన్ని తగ్గించాల్సిందిగా కేంద్రప్రభుత్వం ప్రకటించడంతో రైతులు ముందస్తు జాగ్రత్తలో భాగంగా భవిష్యత్తు అవసరాల కోసం యూరి యాను అధికంగా కొనుగోలు చేయడంతో డిమాండ్ ఏర్పడిందన్నారు. దీంతోపాటు ఒక నెల డ్రై స్పెల్ వచ్చి తరువాత ఒకేసారి వర్షాలు విస్తారంగా పడడం వలన ఎరువుల అవసరం పెరిగి యూరియా సరఫరాపై ఒత్తిడి పడిందన్నారు. సీఎం చంద్రబాబు చొరవతో కేంద్రం అదనంగా రాష్ట్రానికి యూరియా కేటాయించిందన్నారు. దీంతో పూర్తిస్థాయిలో యూరియా అందుబాటులో ఉందన్నారు. రబీకి కూడా యూరియా కేటాయించిందని పేర్కొన్నారు.

రాష్ట్రంలో యూరియా కొరత లేదు

ఏర్పేడు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో యూరియా కొరత లేదని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి అన్నారు. ఏర్పేడులో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వ సహకారంతో అన్నదాత సుఖీభవ పథకం కింద సుమారు 45లక్షల రైతు కుటుంబాలకు రూ.7వేలు వంతున అందించారన్నారు. అమ్మఒడి పేరుతో ఇంట్లో ఎంతమంది పిల్లలుంటే అందరికీ పథకం వర్తింపచేశారన్నారు. ఇన్ని చేస్తున్న కూటమి ప్రభుత్వంపై వైసీపీ నాయకులు యూరియా కొరత ఫేక్ ప్రచారానికి తెర తీశారన్నారు. దీన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. యూరియా కొరత అంటూ వైసీపీ దిగజారుడు రాజకీయాలను చేస్తుందని మండిపడ్డారు.

వైసీపీ హయాంలోనే ఇబ్బందులు

శ్రీకాళహస్తి (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో రైతులు నానా ఇబ్బందులకు పడ్డారని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ జయచంద్రనాయుడు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఆధ్వర్యంలో రైతులకు వ్యవసాయ పనిముట్లు సబ్సిడీ ధరలకు ఇవ్వడం, పచ్చిరొట్ట, విత్తనాలు, ఆధునిక పిచికారీ యంత్రాలను దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో పంపిణీ చేశారన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కోసం ధర స్థిరీకరణ నిధులు విడుదల చేశారన్నారు. ఉల్లిరైతుకు గిట్టుబాటు ధర కల్పించిన ఘనత సీఎంకే దక్కిందన్నారు. నేడు వైసీపీ నాయకులు రైతు పోరు అంటూ ముసలి కన్నీరు కార్చడం విడ్డూరంగా ఉందన్నారు.

రైతులకు యూరియాను అందించాలి


ఆర్డీవో కార్యాలయం వద్ద వైసీపీ నాయకుల ధర్నా

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రైతులకు అవసరమైన యూరియాను వెంటనే అందించాలని వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి డిమాండ్ చేశారు. అన్నదాత పోరు సందర్భంగా పట్టణంలోని వైసీపీ కార్యాలయం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భూమన మాట్లాడుతూ... యూరియా బ్లాక్‌మార్కెట్‌ను నియంత్రించి ఎరువులను పక్కదారిపట్టిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. పంటలకు గిట్టుబాటు ధర కల్పించి ఉచిత పంటల బీమాను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వర్షాల కారణంగా దెబ్బతిన్న ప్రాంతాల రైతులకు వెంటనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలన్నారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం, అంజూరు శ్రీనివాసులు, ఉన్నం వాసుదేవ నాయుడు, గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంచండి


డీఎంకు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి డిపో నుంచి ఇతర ప్రాంతాలకు బస్సు సర్వీసులను పెంచాలని టీడీపీ నాయకుడు, టౌన్‌బ్యాంకు మాజీ ఛైర్మన్ డీవీ నారాయణ, ముక్కంటి ఆలయ పాలకమండలి మాజీ సభ్యులు కాసరం రమేష్, గుర్రప్పశెట్టి కోరారు. మంగళవారం వారు డిపో మేనేజరు చంద్రయ్యకు వినతిపత్రం అందజేశారు. చెన్నైకి ప్రస్తుతం ఉన్న బస్సు సర్వీసులు సరిపోవడం లేదని దీంతో భక్తులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ మార్గంలో బస్సు సర్వీసులను పెంచాలన్నారు. గతంలో శ్రీకాళహస్తి నుంచి నెల్లూరు, విజయవాడకు బస్సులు నడిచేవని ఆ సర్వీసులను పునరుద్ధరించాలని కోరారు.

వృత్తి విద్యాకోర్సులపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న హెచ్‌ఎం రామచంద్రయ్య

ఏర్పేడు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి విద్యార్థీ వృత్తి విద్యా కోర్సులపై అవగాహన కలిగి ఉండాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు భారతి, రత్నమ్మ సూచించారు. మండలంలోని పంగూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం వృత్తి విద్యా కోర్సులపై అవగాహన కల్పించారు. పంగూరు ఉన్నత పాఠశాల వద్ద 10రోజుల పాటు మిషన్‌శక్తి సంకల్ప ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో భాగంగా మహిళా సాధికారత, ఉన్నత విద్య, వృత్తి విద్యా కోర్సులు, పనిచేసే ప్రదేశంలో అంతర్గత ఫిర్యాదుల కమిటీ ఆవశ్యకత, టోల్‌ఫ్రీ నెంబర్లు 1098, 181పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రామచంద్రయ్య, ప్రగతి ఎన్‌జీవో శిరీష, ఏఎన్‌ఎం తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని మంగళవారం తెలంగాణ రాష్ట్రం మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మల్లారెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయస్వామిసన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.1,00,116 విరాళం

శ్రీకాళహస్తి, సెప్టెంబర 9(ఆంధ్రజ్యోతి): ముక్కంటి ఆలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి కావలికి చెందిన నాగలక్ష్మి రూ.1,00,116 విరాళంగా ఇచ్చారు. దాతకు స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేశారు.

వివరణ తీసుకోకుండా విచారణ సమంజసమేనా?

● మండల మీట్‌లో

అధికారులను నిలదీసిన ఎంపీటీసీ సభ్యుడు


అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీ సభ్యుడు రామయ్య

నాగలాపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నిధుల దుర్వినియోగంపై తన వివరణ తీసుకోకుండా విచారణ జరపడం భావ్యమేనా అని ఎంపీటీసీ సభ్యుడు రామయ్య అధికారులను ప్రశ్నించారు. మంగళవారం సత్యవేడు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ ప్రతిమ, జడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చెరివి పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఆరోపణల అంశాన్ని రామయ్య లేవనెత్తారు. పంచాయతీ పరిధిలో 2014-24 వరకు రూ.50 లక్షల దుర్వినియోగమైనట్టు గ్రామస్తుడి ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ చేపట్టారన్నారు. అయితే తనకు నోటీసులు ఇవ్వకుండా డివిజనల్ పంచాయతీ అధికారి ఏకపక్షంగా విచారణ చేయడంపై ప్రశ్నించారు. తాను సర్పంచ్‌గా ఉన్న హయాంలో జరిగిన పనులకు సంబంధించి ఎంబుక్కులు, రికార్డులు పరిశీలించ పోవడంపై ఇన్‌చార్జి ఈవోఆర్‌డీ ముని రవికుమార్‌ని నిలదీశారు. రికార్డులను పరిశీలించిన తరువాతే చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జి ఈవోఆర్‌డీ చెప్పారు. అనంతరం పలు అంశాలపై చర్చించారు. చెన్నేరి పాఠశాలలో స్వీపర్‌గా పనిచేస్తున్న నాగలాపురం మండలానికి చెందిన మహిళను తొలగించి స్థానిక మహిళకు అవకాశం కల్పించాలని ఎంఈవో-2 ఉషకు విన్నవించారు. విద్యార్థుల సౌకర్యార్థం నాగలాపురం నుంచి ఓబులరాజుకండ్రిగ మీదుగా ఆర్టీసీ బస్సు నడపాలని రాజగోపాలపురం సర్పంచ్ మధురాజు కోరారు. రాత్రి వేళలో ఊత్తుకోట బస్టాప్ వద్ద ఆర్టీసీ బస్సులు ఆగడం లేదని పలువురు సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. మండలంలో ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న పక్కా గృహాలను 2026 మార్చిలోపు పూర్తి చేసుకోకుంటే తదుపరి బిల్లులు మంజూరు కావని హౌసింగ్ డీఈ శేషగిరి తెలిపారు. మండల రైతులకు ప్రస్తుతం 22.5 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని ఏవో మురళి తెలిపారు. సభ ప్రారంభం కాగానే ఇటీవల మృతి చెందిన వైస్ ఎంపీపీ సరోజినికి సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, వైద్యులు విద్యాసాగర్, క్రిస్టల్‌దాస్, వెలుగు ఏపీఎం డాంగే యాదవ్, ఉపాధి ఏపీవో విజయభాస్కర్, ఇన్‌చార్జి ఆర్‌ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ప్రారంభమైన కట్ట పుట్టాలమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు - ఆలయం ముందు కుంభం

రేణిగుంట, సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): కట్ట పుట్టాలమ్మ జాతర వైభవంగా ప్రారంభమైంది. కరకంబాడి సమీపంలో ఉన్న అమ్మవారి ఆలయంలో మంగళవారం ఉదయం మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. జాతర సందర్భంగా చుట్టుపక్క గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారికి పొంగళ్లు నైవేద్యంగా సమర్పించారు. ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేయగా డీఎస్పీ శ్రీనివాసరావు నేతృత్వంలో గాజులమండ్యం, రేణిగుంట అర్బన్ పోలీసులు భద్రతా ఏర్పాట్లను చేశారు. ఆలయ కమిటీ ఛైర్మన్ పాడి రాజేంద్ర, కమిటీ సభ్యుడు కె.వి చలం, టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి బుజ్జి నాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

స్మార్ట్‌మీటర్లు వద్దు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): అదానీ స్మార్ట్ మీటర్లు వద్దని... సాధారణ మీటర్లనే కొనసాగించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని విద్యుత్‌శాఖ కార్యాలయంలో ఏడీ సుబ్రహ్మణ్యంకు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు బాలగురవం బాబు మాట్లాడుతూ... స్మార్ట్‌మీటర్ల ఏర్పాటు కార్పొరేట్ కంపెనీలకు మేలు చేసే విధంగా ఉందన్నారు. నియోజకవర్గ సమన్వయకర్త తలపా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ... స్మార్ట్ మీటర్ల నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని కోరారు. సురేంద్రరెడ్డి, ఆంటోని, నవీన్, ఆసీఫ్, నగేష్, నాగరాజు, తేజ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

నారాయణవనం, సెప్టెంబర్ 9(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలను అరికడదామని సీడీపీవో సౌభాగ్యమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం నారాయణవనం బాలికల జిల్లా పరిషత్ పాఠశాలలో సంకల్ప కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లింగ సమానత్వం పాటించాలన్నారు. అనంతరం, గుడ్ అండ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్ బేబి, అంగాన్వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

వాసవికి డాక్టరేట్ ప్రదానం


వాసవి

వరదయ్యపాళెం, సెప్టెంబరు 9(ఆంధ్ర జ్యోతి): ఎస్వీయూ మైక్రోబయాలజీ విభాగం పరిశోధక విద్యార్థి వరదయ్యపాళెం మండలం సంతవేలూరు గ్రామానికి చెందిన తెలుగు ఉపాధ్యాయుడు పురుషోత్తం కుమార్తె కాపులూరు వాసవికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ రాజమాణిక్యం తెలిపారు. ఆమె జంతుశాస్త్ర విభాగానికి చెందిన ప్రొఫెసర్ మారం రాజశేఖర్ పర్యవేక్షణలో 'ఇన్వెస్టిగేషన్ ఆఫ్ బయోజెనిక్ సిల్వర్ నానో పార్టికల్ అగైనెస్ట్ మల్టీడ్రగ్ రెసిస్టెంట్ బ్యాక్టీరియల్ స్ట్రెయిన్స్ ఐసోలేటెడ్ ఫ్రం హాస్పిటల్ ఎన్విరాన్‌మెంట్ అండ్ దేర్ జెనిటిక్ బార్ కోడింగ్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని యూనివర్శిటీకి సమర్పించింది. వాసవి డాక్టరేట్ అందుకోవడం పట్ల పలువురు ఆమెను అభినందించారు.

ఎంజీఎం స్కూల్‌లో ఏఐ కోర్సు



ఏఐ కోర్సును ప్రారంభిస్తున్న మల్లికార్జుననాయుడు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎంజీఎం పాఠశాలలో మంగళవారం ఎంజీఎం గ్రూప్ ఛైర్మన్ గుడ్లూరు మల్లికార్జునాయుడు ఏఐ రోబోటిక్ కోర్సును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎండీ గుడ్లూరు మయూర్ మాట్లాడుతూ... ప్రతి విద్యార్థీ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో విద్య, వైద్యం, వ్యవసాయ రంగాల్లో ఏఐను వినియోగిస్తారని తెలిపారు. ప్రిన్సిపాల్ సుబ్బరత్నం, హెచ్‌ఎం మునిరత్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

కుక్కలతో జనం బెంబేలు


కేవీబీపురం పట్టణంలో గుంపుగా ఉన్న శునకాలు

కేవీబీపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో కుక్కల బెడదతో జనం బెంబేలెత్తుతున్నారు. ముఖ్యంగా ఈ కుక్కలు ప్రధాన రహదారిలో గుంపులుగా తిరుగుతూ పాదచారులు, ద్విచక్ర వాహనదారులపై దాడి చేస్తున్నాయి. పంచాయతీ అధికారులు వీటిని పట్టించుకునే పరిస్థితి లేదు. దీంతో ప్రజలు ప్రధాన వీధిలో పయనించాలంటే భయపడిపోతున్నారు. కుక్కల బెడద నుంచి తమను కాపాడాలని మండలవాసులు కోరుతున్నారు.

మట్టి నమూనా సేకరణపై అవగాహన

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): మట్టి నమూనా సేకరణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు పీఎంఆర్కేవీవై పథకం ద్వారా స్కూల్ సాయిల్ హెల్త్ ప్రోగ్రాం నిర్వహించారు. ఇందులో 8, 9, ఇంటర్ విద్యార్థులకు మట్టి నమూనాల సేకరణపై తిరుపతికి చెందిన వ్యవసాయ అధికారి పుష్పాంజలి అవగాహన కల్పించారు. ఈ ఎఫ్‌టీసీ ఏవో శ్రీనివాసులు, కేవీకే ల్యాబ్ టెక్నీషియన్ ప్రియాంక, మండల ఏవో షణ్ముగం, ఏఈవో రేవతి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

కేవీబీపురం,సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ నాయకుడు రమేష్, ఎంఈవో రవికుమార్ ఆధ్వర్యంలో ఉత్తమ ఎంఈవో, ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఎంఈవో భాస్కర్‌బాబు, ఇటీవల కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న కేజీబీవీ పీఈటీ సతీసావిత్రి, ఉపాధ్యాయులు గజేంద్ర, విజయభాస్కర్‌ను సన్మానించారు. గురునాథం, వెంకటకృష్ణయ్య, సురేష్, లలిత తదితరులు పాల్గొన్నారు.

బార్‌ని తరలించండి


నిరసన వ్యక్తం చేస్తున్న ఆర్చి పరిసరవాసులు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఏపీసీడ్స్ కూలి వద్ద ఆర్చీ పరిసర ప్రాంతాల్లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న మద్యం దుకాణం(బార్)ను తరలించాలని స్థానిక మహిళలు మంగళవారం నిరసన తెలిపారు. మద్యం వద్దు... మహిళలకు రక్షణ కావాలి... అంటూ నినాదాలు చేశారు. ఈ ప్రాంతంలో మద్యం దుకాణం ఏర్పాటు చేస్తే మహిళలకు రక్షణ కరువు అవుతుందన్నారు. దుకాణం తరలించే వరకు నిరసన తెలుపుతామని హెచ్చరించారు.

అటవీ, ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ

రేణిగుంట సెప్టెంబర్ 9 (ఆంధ్రజ్యోతి): అటవీ, ప్రకృతి వ్యవసాయంపై రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో ఒకరోజు శిక్షణ నిర్వహించారు. చైతన్యపురం రాస్ కేవీకేలో గ్రీన్ ప్యానెల్ ఫౌండేషన్ సహకారంతో కార్యక్రమం నిర్వహించారు. అటవీ, ప్రకృతి వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు, వివిధ రకాల కలప, వాటి యాజమాన్య పద్ధతులను కావలి వ్యవసాయ పరిశోధన స్థానం హెడ్ డాక్టర్ శ్రీనివాస్ రెడ్డి, కేవీకే హెడ్ శ్రీనివాసులు వివరించారు. రాస్ శాస్త్రవేత్తలు దివ్య, సుధాకర్, రామ్‌కుమార్, అనూష, దివ్య సుధ, గ్రీన్ ప్యానెల్ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ డాక్టర్ మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం



నాగలాపురం, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ సునీల్ తెలిపారు. వివరాలు ఇలా... మండలంలోని మలిమేలుకండ్రిగ వద్ద అరణియార్ నదిలో సోమవారం రాత్రి అక్రమంగా ఇసుక తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఎస్ఐ సునీల్ సిబ్బందితో దాడి చేశారు. ట్రాక్టర్లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలం దిగువసాంబయ్యపాళెం ఫౌండేషన్ స్కూల్‌లో పనిచేస్తున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కయ్యూరు బాలసుబ్రహ్మణ్యంను మంగళవారం పాఠశాల యాజమాన్య కమిటీ సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవార్డులు తనపై బాధ్యత మరింత పెంచాయన్నారు. విద్యార్థుల సమగ్రాభివృద్ధికి మరింత కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఛైర్మన్ కల్పన, వైస్ ఛైర్మన్ నిర్మల, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.